

ఇక్కడ సినిమా తీస్తే..హిట్టే



సినిమాటోగ్రఫీ మంత్రి దుర్గేష్

కొవ్వూరు,ఫిబ్రవరి 22(ఆంధ్రజ్యోతి) : గోదావరి నదీ పరీవాహక ప్రాంతాల్లో షూటింగ్ జరిగే సినిమాలు తప్పక విజయం సాధిస్తాయని..ఈ సినిమా కూడా హిట్ అవుతుందని రాష్ట్ర పర్యాటక సాంస్కృతిక సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కందుల దుర్గేష్ అన్నారు. కొవ్వూరు మండలం కుమారదేవంలో మైత్రి మూవీ మేకర్స్ ప్రొడక్షన్‌లో షూటింగ్ జరుపుకుంటున్న రాపో 22 చిత్ర నిర్మాణాన్ని శనివారం ఆయన సందర్శించారు. హీరో రామ్ పోతినేని, డైరెక్టర్ పి.మహేష్‌బాబులను కలుసుకున్నారు.

ఆర్టీసీ ప్రయాగ్‌ం అదుర్స్!



ఆర్టీసీ ప్రయోగం అదిరింది.. ప్రయాగ్‌రాజ్‌లో కుంభమేళాకు వేలాదిగా భక్తులను తరలించింది.. ఎక్కడా ఎటువంటి లోటు పాట్లు లేకుండా చూసుకుని.. ఆర్టీసీలో ప్రయాణం సురక్షితమే కాదు.. సుఖవంతం కూడా అని నిరూపించింది.. మరో మూడు రోజుల్లో కుంభమేళా ముగియనున్న నేపథ్యంలో ఆర్టీసీపై ప్రత్యేక కథనం 6

చదువుల్లోనే కాదు.. ఆటల్లోనూ ఫస్ట్ అంటున్నారు.. నన్నయ వర్సిటీ వీసీ ప్రసన్న శ్రీ.. నన్నయ వర్సిటీలో నిర్వహించిన క్రికెట్ పోటీలను వీసీ బ్యాటింగ్ చేసి శనివారం ప్రారంభించి మాట్లాడారు. విశ్వవిద్యాలయంలో సిబ్బందికి, విద్యార్థులకు వివిధ పోటీలు నిర్వహిస్తున్నామన్నారు. చక్కటి కార్యక్రమాలు నిర్వహిస్తున్న విశ్వవిద్యాలయం ఉమెన్ సెల్‌ను అభినందించారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ ఆచార్య జి.సుధాకర్, ఉమెన్స్ సెల్ కోఆర్డినేటర్ ఆచార్య ఉమామహేశ్వరీదేవి పాల్గొన్నారు. - దివాన్‌చెరువు



క్రికెట్ ఆడేస్తా!

ఆలయాలకు గ్రేడ్‌లు

- గతేడాది జీవో 268 విడుదల
- 108 టెంపుల్స్, సంస్థలకు గ్రేడ్‌లు
- ఆదాయం ఆధారంగా కేటాయింపు

రాజమహేంద్రవరం, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలోని దేవాదాయ ధర్మాదాయ శాఖ ఆధీనంలోని 108 ఆలయాలు, సంస్థల గ్రేడ్‌లను ఖరారు చేస్తూ ఆ శాఖ కమిషనర్ కె.రామచంద్ర మోహన్ ఆదేశాలు జారీ చేశారు. వాస్తవానికి ప్రభుత్వం ఈ అంశానికి సంబంధించి గతేడాది నవంబరు 12న జీవో 268ని విడుదల చేసింది. అయితే కొన్ని 'అంతర్గత వ్యవహారాల' వల్ల దీనిని తొక్కిపెట్టారు. తర్వాత ఆర్యస్వత ఆధికారి సీరియస్ కావడంతో వర్గీకరణలో మార్పులు తప్పలేదు. ఈ ఉత్తర్వుల ప్రకారం రాజమహేంద్రవరంలోని ఉమా కోటిలింగేశ్వర, ఉమా మార్కండేయ, శ్యామలాంబ ఆలయాలు 6(బి)(2)లోకి వెళ్లాయి. జేగురుపాడు జనార్దన స్వామి, ధవళేశ్వరం లక్ష్మీ జనార్దన స్వామి, రాజమహేంద్రవరంలోని కన్యకపు పేర ఒటాలమ్మ, జాంపేట ఉమా రామలింగేశ్వర, వీరభద్రాపురం పల్లి సుబ్రహ్మణ్యేశ్వర తదితర దేవాలయాలను జక నుంచి 6(బి)(2)గా పరిగణిస్తారు.రాజమహేంద్రవరంలోని గౌతమి గ్రంథాలయం, నేషనల్ సీనియర్ బేసిక్ స్కూల్‌తో పాటు కోరుకొండ, చిట్టిపేట, కొవ్వూరు, మద్దూరు,నిడదవోలు, గోపాలపురం, రంగంపేటలోని సత్రాలను 6(సి)(1)లోకి చేర్చారు.

గ్రేడ్‌లు ఇలా ఇచ్చారు..

ఆలయాలకు,సంస్థలకు వచ్చే ఆదాయాన్ని బట్టి 6(ఏ), 6(బి), 6(సి)గా వర్గీకరణ చేశారు. వార్షికాదాయం రూ.25లక్షలకు పైబడి ఉంటే 6(ఏ), రూ.2 లక్షల నుంచి రూ.25 లక్షల వరకూ 6(బి), రూ.2 లక్షల్లోపు ఆదాయం సమకూరితే 6(సి)గా పరిగణించడం జరిగేది. ప్రభుత్వం వాటిని సవరించింది. 6(ఏ) రూ.50లక్షలపైన, 6(బి) రూ.15 లక్షల నుంచి రూ.50 లక్షలు, 6(సి)గా రూ.15 లక్షల వరకూ ఆదాయం ఉన్న వాటిని మార్పు చేయాలని నిర్ణయిస్తూ జీవో 268ని జారీ చేసింది.



రాజానగరంలో పరిశీలిస్తున్న డీపీవో

స్వచ్ఛ సర్వేక్షణ్ ప్రారంభం

రాజానగరం, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): జిల్లా వ్యాప్తంగా 300 గ్రామ పంచాయతీల్లో రెండు రోజులు ఇంటింటా చెత్త సేకరణ ప్రత్యేక డ్రైవ్ నిర్వహిస్తున్నట్టు డీపీవో విశాలాక్షి తెలిపారు. రాజానగరంలో శనివారం చెత్త సేకరణ ప్రత్యేక డ్రైవ్‌ను డీపీవో ఎంఎంగారితో కలిసి పరిశీలించారు.స్వచ్ఛ సర్వేక్షణ్ కార్యక్రమంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలన్నారు.శనివారం ప్రారంభమైన స్వచ్ఛసర్వేక్షణ్ ఆదివారం కొనసాగుతుందన్నారు.కార్యక్రమంలో ఈవో పీ ఆర్డీ లక్ష్మీకాంత్రెడ్డి ప్రసాద్ పాల్గొన్నారు.

జవాబుదారీతనంతో రెవెన్యూ సేవలందించాలి

సమీక్షలో కలెక్టర్ ప్రశాంతి

రాజమహేంద్రవరం సిటీ, ఫిబ్రవరి 22(ఆంధ్రజ్యోతి): రెవెన్యూ సేవలు జవాబుదారీతనంతో అందించాలని కలెక్టర్ పి ప్రశాంతి ఆదేశించారు. రాజమహేంద్రవరం కలెక్టరేట్‌లో శనివారం జిల్లా రెవెన్యూ అధికారులతో సమీక్షించారు. రీసర్వేలో మ్యుటేషన్, కొలతలు ,గ్రౌండ్ ట్రూథింగ్ పనులు పూర్తి చేసే విషయంలో పారదర్శకంగా వ్యవహరించాలని ఆదేశించారు. రెవెన్యూకి ఐదు కేటగిరీలకి చెందిన అర్జీలు ఎక్కువ వస్తున్నాయన్నారు. అర్జీ దారుని సమస్య వినడం వల్ల సమస్యకు పరిష్కారం లభిస్తుందన్న నమ్మకం కలుగుతుందన్న విషయాన్ని గుర్తు చేశారు. ఈ సమావేశంలో డీఆర్‌వో టి.సీతారామమూర్తి,ఆర్డీవోలు కృష్ణ నాయక్, రాణి సుస్మిత, ఏవో ఖతీ, తహసిల్దార్లు, కలెక్టరేట్ సిబ్బంది పాల్గొన్నారు.

ఫైర్ స్టేషన్లు.. వస్తున్నాయ్!



జిల్లాకు రెండు మోడల్ ఫైర్‌స్టేషన్లు

- ఫలించిన ఎదురుచూపులు
- ఒక్కో స్టేషన్‌కు రూ.2.85 కోట్లు
- దేవరపల్లిలో ఒకటి.. బొమ్మూరులో మరొకటి నిర్మాణం
- నాడు పట్టించుకోని వైసీపీ
- కూటమి ప్రభుత్వంలో కదలిక
- ఎమ్మెల్యేలు చొరవ చూపాలి

(రాజమహేంద్రవరం-ఆంధ్రజ్యోతి)

ఎన్నాళ్ల నిరీక్షణో.. ఎప్పటి కలో.. త్వరలో తీర నుంది. జిల్లాకు మరో రెండు ఫైర్ స్టేషన్లు అందుబాటులోకి రానున్నాయి. దేవరపల్లి, బొమ్మూరులో మోడల్ స్టేషన్ల తరహాలో వాటిని నిర్మించనున్నారు.ముఖ్యంగా దేవరపల్లి, గోపాలపురం పరిసర ప్రాంతాల ప్రజలకు ఇది తీపి కబురని చెప్పవచ్చు. గత టీడీపీ ప్రభుత్వంలో పనుల వరకూ వచ్చినా తర్వాత ప్రభుత్వం మారడంతో ఫలితం లేకుండా పోయింది. శంకుస్థాపనతోనే గత వైసీపీ ఎమ్మెల్యే సరిపెట్టారు. తర్వాత కూటమికి ప్రజలు అధికారం కట్టబెట్టడంతో కొత్త ఫైర్‌స్టేషన్ల ఫైళ్లకు మోక్షం కలుగుతోంది.

దేవరపల్లిలో..

దేవరపల్లిలో కొత్తగా ఫైర్ స్టేషన్ నిర్మాణానికి సన్నాహాలు జరుగుతున్నాయి. 2019కి ముందే గోపాలపురంలో ఫైర్ స్టేషన్‌ని అప్పటి టీడీపీ ప్రభుత్వం మంజూరు చేసింది.ఆ తర్వాత ప్రభుత్వం మారడంతో వైసీపీ ప్రభుత్వ హయాంలో దేవరపల్లి శివారు రామన్నపాలెం సమీపంలో ఫైర్ స్టేషను నిర్మాణానికి అప్పటి ఎమ్మెల్యే శంకుస్థాపన చేసి వదిలేశారు. ఈ సారి కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో ఫైర్‌స్టేషనుకు మళ్లీ కదలిక వచ్చింది. దేవరపల్లి, గోపాలపురం పరిసర ప్రాంతాల్లో పొగాకు బ్యారన్లు అధిక సంఖ్యలో ఉన్నాయి. దీంతో ఇక్కడ నిత్యం అగ్ని ప్రమాదాలు జరుగుతూనే ఉంటాయి. ఫైర్ స్టేషను లేకపోవడంతో ఈ ప్రాంతంలో ఏదైనా అగ్ని ప్రమాదం జరిగితే 25 కిలో మీటర్ల దూరంలో ఉన్న నిడదవోలు లేదా 30 కిలోమీటర్ల దూరంలో ఉన్న కొవ్వూరు లేదా జంగారెడ్డిగూడెం నుంచి 26 కిలోమీటర్లు ప్రయాణించి ఫైర్ ఇంజను రావాల్సి వచ్చేది. ఈలోపు జరగాల్సిన నష్టం జరిగిపోయేది. ఇప్పుడు దేవరపల్లిలో ఫైర్ స్టేషను వస్తుండడంతో స్థానికుల్లో ఆనందం వ్యక్తమవుతోంది. దేవరపల్లి శివార్లలో కంటే దేవరపల్లి- గోపాలపురం మధ్య గొల్లగూడెం సమీపంలో నిర్మిస్తే అనువుగా ఉంటుందని స్థానికులు చెబుతున్నారు. దేవరపల్లిలో నిర్మిస్తే గోపాలపురం 8 కిలోమీటర్లు ప్రయాణించాలి. అదే గొల్లగూడెం సమీపంలో అయితే అటూ ఇటూ 4 కిలోమీటర్లలో చేరవచ్చు. ఇక్కడ రెవెన్యూకు ఎకరం భూమి కూడా ఉంది.

మోడల్‌గా నిర్మాణం

జిల్లాలో ప్రస్తుతం నిడదవోలు, కొవ్వూరు, రాజమండ్రి (ఆర్యాపురం), అనపర్తి, కోరుకొండలో అగ్నిమాపక, విపత్తు ప్రతిస్పందన (ఫైర్ స్టేషను) స్టేషన్లు ఉన్నాయి.ఇప్పుడు రాబోతున్న రెండు ఫైర్‌స్టేషన్లు ప్రస్తుతం ఉన్న వాటి మాదిరిగా కాకుండా మోడల్‌గా నిర్మిస్తారు. ఒక్కో స్టేషనుకు రూ.2.85 కోట్లను ప్రభుత్వం వెచ్చించనుంది. సిబ్బందికి రెస్ట్ రూమ్‌లు, ర్యాంపులు, ఆకర్షణీయమైన ఎలివేషన్, స్టోర్ రూమ్స్ వంటివి ఉంటాయి. ఒక్కో స్టేషనులో ఫైరింజనుతో పాటు 16 మంది సిబ్బంది,ఫైర్ ఆఫీసర్ ఉంటారు.ఈ పోస్టులను ప్రభుత్వం మంజూరు చేయాలి.ఈ రెండు ఫైర్‌స్టేషన్లు అందుబాటులోకి వస్తే జిల్లాలో నియోజకవర్గానికొకటి చొప్పున ఉంటాయి. మొత్తం జిల్లాలో 7 ఫైర్‌స్టేషన్లు ఉంటాయి.

బొమ్మూరులో..

గత వైసీపీ ప్రభుత్వంలో ఫైర్ స్టేషను నిర్మాణానికి ఎక్కడో వెలుగుబందకు అవతల దూరంగా స్థలం కేటాయించారు. ఇక్కడకు ఫైరింజన్ రాకపోకలు సాగించాలంటే సాధ్య పడదు. అందువల్ల ఆ ప్రక్రియ ముందుకు సాగలేదు. ఇప్పుడు రూరల్ ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్యచౌదరి చొరవతో బొమ్మూరు రోడ్డుకు ఓ కిలోమీటరు దూరంలోని సుబ్బాయమ్మ లే-అవుట్‌లో స్థలం కేటాయింపునకు ప్రయత్నాలు జరుగుతున్నాయి. ఫైర్ స్టేషను నిర్మాణానికి అవసరమైన 30 సెంట్ల భూమిని ఎంత త్వరగా ఫైర్ శాఖకు కేటాయిస్తే అంత మేలు జరుగుతుంది. ఏదేమైనా ఎమ్మెల్యేలు మరింత చొరవ చూపితే ఈ ఎండాకాలానికి రెండు ఫైర్ స్టేషన్లు సేవకు సిద్ధం అవుతాయి.

అనుమతులు లేకుండా గ్రావెల్ తవ్వితే శిక్షార్హులు

జిల్లా కలెక్టర్ ప్రశాంతి

రాజమహేంద్రవరం,ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో మైనింగ్ పాలసీని అందరూ పాటించవలసిందేనని కలెక్టర్ పి.ప్రశాంతి హెచ్చరించారు. జిల్లాలో కొవ్వూరు తదితర ప్రాంతాల్లో అక్రమంగా గ్రావెల్ మట్టి తవ్వకాలు జరుగుతున్న విషయంలో 'ఆంధ్రజ్యోతి' వెలుగులోకి తెచ్చిన కథనంపై స్పందించారు. ఏపీ చిన్న తరహా ఖనిజ నియమావళి 1966 ప్రకారం గనుల భూగర్భశాఖ అను మతి లేకుండా క్వారీ నిర్వహించకూడదన్నారు.అనుమతి లేకుండా ఖనిజ రవాణా చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. అక్రమ మైనింగ్ చేసే శక్తులు అభ్యంతరాన్ని అనుమతి లేకుండా జిరాయితీపట్టా భూముల్లో ఖనిజ తవ్వకాలు చేస్తే భూయజమానిపై చర్యలు తీసుకుంటామన్నారు. జిల్లాలో ఎవరూ అనుమతి లేకుండా మట్టి తవ్వకూడదని, తరలించకూడదని ఆమె స్పష్టం చేశారు.



దేవరలో తనిఖీలు చేస్తున్న మైన్స్ అధికారులు

మైన్స్ అధికారుల తనిఖీ

కొవ్వూరు, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి) : కొవ్వూరు మండలం దేవరపల్లి గ్రామంలో ఎర్రమట్టి మట్టి తవ్వకాల ప్రాంతాలను శనివారం మైన్స్ ఏడీ డి.విజయలక్ష్మీ పరిశీలించారు. 'అనకొండలు' శీర్షికన శనివారం ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన కథనంపై అధికారులు స్పందించారు. సర్వేయర్‌తో భూములను కొలిపించారు. నివేదికలు తయారుచేసి ఉన్నతాధికారులకు అందజేస్తామన్నారు.ఎర్రమట్టి తవ్వకాలు చేపట్టిన భూములకు సంబంధించిన రైతులకు నోటీసులు అందజేస్తామన్నారు.మైన్స్ టెక్నికల్ అసిస్టెంట్ తేజ, సర్వేయర్ శ్రీనివాస్,వీర్వోలు పాల్గొన్నారు.

చూసీ.. చూడనట్టు!

ఎవరైనా పట్టించుకుంటే ఒట్టు!

వెళ్లలన్నా కష్టమే:
జిల్లాల విభజన అనంతరం వైటీసీ భవనంలో ఏర్పాటు చేసిన 10 జిల్లా కార్యాలయాలు



- సమస్యల మధ్యే..ఆఫీసులు
- 10 జిల్లా కార్యాలయాలు ఉన్నా.. సౌకర్యాలు సున్నా
- వెళ్లడానికి దారుండదు..
- తాగడానికి నీరుండదు
- మరుగుదొడ్లకూ ఇబ్బందే
- రాత్రయితే అంధకారమే
- నాడు హడావుడిగా ఏర్పాటు
- నేటికీ పట్టని అధికారులు
- ప్రజానీకానికి ఇబ్బందులు

రాజమహేంద్రవరం రూరల్, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో ఎక్కడ ఏ సమస్య ఉన్నా అక్కడికే రావాలి. జిల్లా అధికారులకు చెప్పాలి.సమస్యను పరిష్కరించుకోవాలి. అయితే అక్కడికి వెళ్లాలంటే ఎక్కడికి వెళ్లాలి. ప్రస్తుతం మన జిల్లా కార్యాలయాల పరిస్థితి. జిల్లా కార్యాలయాలంటే ఆకర్షణీయంగా ఉండాలి. అయితే రాజమహేంద్రవరం రూరల్ కేంద్రంగా ఉన్న జిల్లా కార్యాలయాలను పరిశీలిస్తే మాత్రం అక్కడ అన్నీ సమస్యలే. జిల్లా వ్యవస్థ విభజన నేపథ్యంలో జిల్లాకు కొన్ని ప్రధాన కార్యాలయాలు న్యాక్ భవనంలోని కలెక్టరేట్ కార్యాలయం సమీపంలో గల యూత్ ట్రైనింగ్ సెంటర్ (వైటీసీ)లో కేటాయించారు.జిల్లా వ్యాప్తంగా ఉన్న 300 పంచాయతీల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరించే జిల్లా పంచాయతీ అధికారి కార్యాలయం, కోట్లాది రూపాయల కేంద్ర ప్రభుత్వ నిధులు వెచ్చించి పలు అభివృద్ధి పనులు చేపట్టే డ్వామా పీడీ కార్యాలయం, పరిశ్రమల శాఖ, ఆగ్రోమార్క్, స్పోర్ట్స్ వైద్యశాఖ, విద్యుత్ సంస్థ,సమాచార పౌర సంబంధాల కార్యాలయాలు ఉన్నాయి.జిల్లాలో ఆప్కో డీలర్ డీపీ కార్యాలయం ప్రారంభించారు.సుమారు 10 జిల్లా కార్యాలయాలు ఉన్నా సౌకర్యాలు కరువే.

గత వైసీపీలో హడావుడిగా..

గత వైసీపీ ప్రభుత్వంలో హడావుడిగా జిల్లాల విభజన చేశారు.అంతే హడావుడిగా కార్యాలయాల కేటాయింపులు చేసేశారు. అయితే ఆ కార్యాలయాలకు వెళ్లే కనీస వసతులు కల్పించేమనో వక్క ఆ కార్యాలయాలకు వెళ్లాలన్నా గగనమే. సొంత వాహనం ఉంటేనే కానీ వెళ్లలేని పరిస్థితి. అంతే కాకుండా నగరంలోనే ఉన్నా భయంకరంగా ఎక్కడో అడవుల మధ్య ఉన్నట్టే ఉంటుంది ఆ ప్రాంతమంతా.కొన్ని నీటి వసతి లేని తరవాత కార్యాలయాల్లో ఉంటే పాములు రావడం కాయమే.అయితే రోజు 10 జిల్లా కార్యాలయాలు ఉన్నాయి.ఆ కార్యాలయాలకు వచ్చే మహిళా సిబ్బంది సమస్యలు చెప్పనలవికావు. కార్యాలయాల వద్ద మరుగుదొడ్లు, మంచి నీటి సౌకర్యం లేక ఆటు ఉద్యోగులతో పాటు, సమస్యల పరిష్కారం కోసం వచ్చే ప్రజానీకం నానా అవస్థలు పడుతున్నారు. కొన్ని శాఖల సిబ్బంది తలో కొంత వేసుకుని వాటర్ ప్యూరి ఫైర్ బాగు చేయించుకున్నామని చెబుతున్నారు. వెహికల్ పార్కింగ్ లేక అధికారులు సిబ్బంది కార్యాలయం ముందే పార్కింగ్ చేస్తున్నారు. కార్యాలయాలకు పలు సమస్యల నిమిత్తం వచ్చే అర్జీదారులు చెట్ల కింద ఉండేందుకు వీలులేని పరిస్థితి.



అధ్వానంగా మరుగుదొడ్డి



బాత్‌రూమ్‌లో కుక్క

డ్వామా కార్యాలయంలో ఊడిపోయిన ప్లాస్టర్ ఆఫ్ పారిస్



జిల్లా అధికారుల నిర్లక్ష్యం

గత ప్రభుత్వ పాలకుల నిర్లక్ష్య ఒక కారణమైతే..కొంతమంది జిల్లా అధికారుల నిర్లక్ష్యం కూడా కొన్ని కార్యాలయాల ఆధునీకరణకు నోచుకోలేదు. నిధులను పక్కదారి పట్టించిందన్న సమాచారం.దీనికి ఉదాహరణ డ్వామా కార్యాలయంలో కూలిపోయిన సీలింగ్.సుమారు రూ.5 లక్షలతో కార్యాలయంలో పాటు పీడీ గది ఆధునీకరించారు.దీంతో పాటు లాప్‌టాప్ కొన్ని ఉపకరణాలు కొనుగోలు చేశారు.ఇక్కడే ట్విస్ట్ ఏమిటంటే సర్కారు సొమ్ముతో లాప్‌టాప్ కొన్నా నేటికీ తిరిగివ్వకపోవడం.ఇక వేసవిలో ఫ్యాన్ లైనా నాణ్యత లేదు. డీపీవో కార్యాలయం అయితే మరింత దారుణంగా ఉంది. చీకటి పడితే అంధకారమే. మరుగుదొడ్లు కుక్కలకు ఆవాసాలుగా తయారయ్యాయి. మెట్ల కింద ఉన్న విద్యుత్ బోర్డులు ప్రమాదకరంగా ఉన్నాయి.ఆ పక్కనే సిబ్బంది తమ మోటారు సైకిళ్లు పార్కింగ్ చేస్తున్నారు.పొరపాటున షార్ట్ సర్క్యూట్ అయితే పరిస్థితి అంతే. ఈ భవనంలో 10 శాఖలు పైగా ఉన్నాయి.



ప్రమాదకరంగా ఉన్న విద్యుత్ వైర్లు

చట్టాన్ని విభేదించిన పిల్లల్లో మార్పు తేవాలి : పీడీజే

రాజమహేంద్రవరం, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి) : చట్టాన్ని విభేదించిన పిల్లలను గుర్తించి వారిలో మార్పు తీసుకొచ్చి దిశగా అధికారుల చేయాలని ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ప్రధాన న్యాయమూర్తి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చైర్‌పర్సన్ గంధం సునీత సూచించారు. లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సెల్ న్యాయవాదులు, స్త్రీ శిశు సంక్షేమ శాఖ, పోలీస్ శాఖ, స్పెషల్ జువైనల్ పోలీస్ యూనిట్ల సిబ్బందికి శనివారం నిర్వహించిన శిక్షణ కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. ఆదరణ కొరవడి, వివక్షకు గురవుతున్న చిన్నారులు నేర ప్రవృత్తి బారిన పడుతున్నారన్నారు. అలాంటి వాళ్లను గుర్తించి సన్మార్గంలో నడిపించాలని చెప్పారు. బాలికల పాఠశాలలు, సాంఘిక సంక్షేమ వసతి గృహాలు, కళాశాలల్లో పిల్లలపై జరిగే దాడుల నివారణకు ఆయా ప్రాంతాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసి డాక్యుమెంటరీ ఎవిడెన్స్ పర్యవేక్షణ చూసుకోవాలని ఆదేశించారు.పీడీజేఎ తర్వాత కార్యక్రమంలో ప్రిన్సిపల్ మేజిస్ట్రేట్ మూడో ఏసీజేఎం,డీఎల్‌ఎస్ఏ కార్యదర్శి ఎన్.శ్రీలక్ష్మీ,అదనపు ఏడీపీ ఎస్పీ,డీడీ ఆర్‌సీవీ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

వీళ్లు మారరు..?

ప్రభుత్వ బోధనాసుపత్రి ఎదుట వైద్యానికి మహిళ పడిగాపులు

రాజమహేంద్రవరం అర్బన్, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి) : అత్యవసర వైద్యసేవ విషయంలో రాజమహేంద్రవరం ప్రభుత్వ బోధనాసుపత్రి వైద్యులు, వైద్య సిబ్బంది తీరు మారడంలేదు. రాజమహేంద్రవరానికి చెందిన ఒక మహిళను తీవ్ర అనారోగ్యం కారణంగా శనివారం రాత్రి ఒక ప్రైవేట్ ఆసుపత్రి నుంచి వెంటిలేటర్‌పై బోధనాసుపత్రికి తీసుకొచ్చారు.ఆమెను చేర్చుకోవడానికి ఆసుపత్రిలోని డ్యూటీ వైద్యులు నిరాకరించారు. కేసు సీరియస్‌గా ఉందని, కాకినాడ తీసుకెళ్లిపోవాలంటూ చెప్పేశారు. ఈ సమాచారం తెలుసుకున్న టీడీపీ నాయకుడు కాశి నవీన్‌కుమార్ ఆసుపత్రికి చేరుకుని వైద్యాధికారులతో మాట్లాడారు. పేదలు అత్యవసర వైద్యం కోసం వస్తే నిరాకరించడం సరికాదని, వైద్యసేవలు అందించాలని సూచించారు. దీంతో దిగొచ్చిన ఆసుపత్రి అధికారులు ఆమెను ఐసీయూకు తరలించి వైద్యం అందించారు. దీనిపై సూపరింటెండెంట్ డాక్టర్ లక్ష్మీసూర్యప్రభ మాట్లాడుతూ అత్యవసర కేసుల విషయంలో అప్రమత్తంగా సిబ్బందికి ఆదేశాలు జారీ చేస్తామన్నారు.

ఆక్రమిత స్థలాల క్రమబద్ధీకరణ

- మార్గదర్శకాలు విడుదల
- దరఖాస్తుల ఆహ్వానం
- 2019కి ముందే వర్తింపు
- 150 చ.గ వరకూ ఉచితం

రాజమహేంద్రవరం అర్బన్, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి) : పేదలు నివాస యోగ్యమైన స్థలాల ఆక్రమణలను సంబంధించి ఆక్రమణలను క్రమబద్ధీకరణ చేపట్టేందుకు ప్రభుత్వం మార్గదర్శకాలు విడుదల చేసిందని ఆర్డీవో ఆర్.కృష్ణనాయక్ అన్నారు. ఈ మేరకు శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు.ఆక్రమణలను క్రమబద్ధీకరించేందుకు గ్రామ/వార్డు సచివాలయాల్లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. 2019 అక్టోబరు 15కి ముందు ఈ స్థలం వద్ద ఉన్న అర్జీదారులు వారి ఆధారాలతో జీ ఏర్పాటు చేసుకుని ఉండాలి. నిర్మాణం కలిగి ఉండాలని, నిర్దేశిత తేదీకి ముందు కరెంటు బిల్లు, ఇంటి పన్ను, నీటి పన్ను కలిగి ఉండాలన్నారు. 150 చదరపు గజాల వరకు ఉచితంగా, ఆ పై బేసిక్ విలువ ప్రకారం ప్రభుత్వం నిర్దేశించిన రుసుము చెల్లించాల్సి ఉంటుందన్నారు. ప్రభుత్వం జారీ చేసిన జీవోపై లబ్ధిదారులు అంశాలు పరిగణనలోకి తీసుకుంటారన్నారు.

కోనసీమ జిల్లాలో
రూ.97 లక్షల ఆదాయం

డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా నుంచి ప్రయాగ్‌రాజ్‌లో జరుగుతున్న మహా కుంభమేళాకు వేలాది మంది భక్తులు తరలి వెళుతున్నారు. రైళ్లు, విమాన ప్రయాణాలతోపాటు ఆర్టీసీ బస్సుల ద్వారా కూడా భారీ సంఖ్యలో ప్రజలు కుంభమేళాకు వెళ్లి పవిత్ర పుణ్య స్నానాలు ఆచరిస్తున్నారు. జిల్లా పరిధిలోని అమలాపురం, రాజోలు, రావులపాలెం, రామచంద్రపురం బస్ డిపోల నుంచి ఇప్పటి వరకు 25 బస్సుల్లో 900 మంది ప్రయాణికులు కుంభమేళాకు వెళ్లారు. ఈ యాత్రకు ఆర్టీసీ సూపర్‌లగ్జరీ వీడియో కోచ్‌లు ప్రయాణికుల కోసం ఏర్పాటుచేసింది. మొత్తం 14 ప్రాంతాల్లోని పుణ్యక్షేత్రాల్లో ముఖ్యమైనవి వారణాశి, అయోధ్యతోపాటు ప్రయాగరాజ్‌లో త్రివేణి సంగమ పుణ్యస్నానాలు చేస్తున్నారు. ఒక్కొక్క ఆర్టీసీ బస్సులో 36 మంది ప్రయాణికులతో వెళ్లాయి. అమలాపురం డిపో నుంచి ఇప్పటి వరకు తొమ్మిది బస్సులు, రావులపాలెం నుంచి 8, రామచంద్రపురం డిపో నుంచి 4, రాజోలు డిపో నుంచి 4 వెరసి 25 బస్సుల్లో 900 మంది ప్రయాణికులు కుంభమేళాకు వెళ్లారు. ఆర్టీసీ సౌకర్యాల పట్ల భక్తులైతే హర్షాతిరేకాలు వ్యక్తంచేస్తున్నారు. అయితే ఎనిమిది రోజుల ట్రిప్‌కుగాను ట్రాఫిక్ రద్దీ కారణంగా పది రోజులు పడుతుందనేది ఆర్టీసీ అధికారులు పేర్కొంటున్నారు.



అమలాపురం/రాజమహేంద్రవరం అర్బన్/ కార్పొరేషన్ (కాకినాడ) / కొవ్వూరు/నిడదవోలు/ ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి):

కుంభమేళాకు ఎన్నడూ లేనంతగా వేలాది సంఖ్యలో ఈసారి ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా నుంచి భక్తులు తరలివెళ్లారు. ఇది 144 సంవత్సరాలకు ఒకసారి వచ్చేదని ప్రచారం జరగడంతో దీనిపై మరింత ఆసక్తి పెరిగింది. దీనికనుగుణంగా తప్పనిసరిగా కుంభమేళాకు వెళ్లి పుణ్యస్నానాలు ఆచరించాలని జనం భావించారు. ఎంతో దూరం, మరెంతో వ్యయప్రయాసలైనప్పటికీ భక్తులు వెళ్లారు. రైళ్లలోను, బస్సుల్లోనూ ఈ ప్రయాణాలు చేసేందుకు అందరూ ఏర్పాట్లు చేసుకున్నారు. ప్రత్యేక రైళ్లు వేయడంతో కొంతవరకు ఈ మార్గాన వెళ్లారు. అయితే చాలా మంది బస్సుల్లో తీర్థయాత్రల మాదిరిగా వెళ్లడానికి ఆసక్తి చూపారు. దీనికి ప్రధాన కారణం ఏపీఎస్ ఆర్టీసీయే. సాధారణంగా పండుగల్లో స్పెషల్ సర్వీసులు నడపడం ఆర్టీసీకి కొత్తేమీ కాదు. పంచారామ క్షేత్రాల దర్శనాలకూ సర్వీసులు నడుపుతారు. కానీ కొద్దికాలంగా ఆర్టీసీ అధికారులు వచ్చిన ప్రతి అవకాశాన్ని వినియోగించుకునేందుకు డిపోల వారీగా పోటీ పడుతున్నారు. అరుణాచలం గిరి ప్రదక్షిణలకు ప్రతి నెలా సర్వీసులు నడుపుతున్నారు. ఏకాదశ రుద్రుల దర్శనం పేరిట కొవ్వూరు డిపో నుంచి వంద బస్సులకు పైగా ప్రత్యేక సర్వీసులు నడిపారు. ఇలా ప్రతి సందర్భాన్ని ఆర్టీసీ యాత్రల పేరిట సర్వీసులు నడపడం విశేషం. ఇందులో భాగంగానే కుంభాభిషేకానికి ప్రత్యేక సర్వీసులను పెద్దఎత్తున నడిపారు. వేలాది కిలోమీటర్ల మేర సర్వీసులు నడపడం అంటే ఆషామాషీ కాదు. యాత్ర బస్సు అంటేనే భోజన, వసతి సౌకర్యాలు సైతం సమకూర్చాలి. ఎలాంటి ఇబ్బందులు ప్రయాణికులకు కలుగకుండా నడపాలి. ఈసారి కుంభమేళాలో ఆర్టీసీ సర్వీసులకు ఎంతో ఆదరణ దక్కింది. భోజన, వసతి సదుపాయాల్లో చక్కటి సౌకర్యాలు సంతృప్తి కలిగించాయి. టిక్కెట్టు ధర కూడా రూ.10,800 నుంచి రూ.12500 మధ్య అందుబాటులోనే ఉండడం మరింత వెసులుబాటు కలిగించింది. ఇన్ని సౌకర్యాలు కల్పిస్తూనే ఆర్టీసీ కూడా తమ ఆదాయాన్ని గణనీయంగా పొందడం మరో విశేషం.

మహాకుంభ మేళాతో జన్మధన్యం



మహాకుంభ మేళా యాత్రకు వెళ్లడంతో జన్మ ధన్యమైంది. యాత్రలో భాగంగా 14 పుణ్య క్షేత్రాలను దర్శించాం. పుణ్యనదీ స్నానాలు ఆచరించడం జీవితంలో ఎప్పటికీ మరిచిపోలేని మధురానుభూతి. 124 ఏళ్లకు ఒకసారి వచ్చే మహాకుంభమేళాలో పాల్గొనడం దేవుడిచ్చిన వరం. ఆర్టీసీ సంస్థ కల్పించిన సదుపాయాలు అద్భుతం. ఎక్కడా ఎవరికీ ఏ లోటు రానీయలేదు. ఆర్టీసీ సంస్థ భక్తులకు కల్పించిన అద్భుత అవకాశమిది.

కాండ్రేగుల శ్రీనివాసరావు, లక్ష్మీసంధ్య దంపతులు
అంబాజీపేట



మహాకుంభమేళా యాత్రకు వెళ్లిన కోనసీమ బృందం

మన ఊరి నుంచి మహా యాత్ర
ఆర్టీసీ ప్రయాగ్‌ం అదుర్స్



'తూర్పు' రూ.47.52 లక్షలు

ప్రయాగ్‌రాజ్ మహాకుంభమేళాకు తూర్పుగోదావరి జిల్లా ఆర్టీసీ 532 మంది భక్తులను ఇప్పటిదాకా పుణ్యస్నానాలకు తీసుకెళ్లింది. ఈ కుంభమేళా టూర్ ద్వారా జిల్లా ఆర్టీసీకి రూ.47,52,400ల ఆదాయం లభించింది. రాజమహేంద్రవరం, గోకవరం, కొవ్వూరు, నిడదవోలు డిపోల నుంచి మొత్తం 16 బస్సులను ఆపరేట్ చేశారు. గోకవరం డిపో నుంచి రెండు బస్సుల్లో 68 భక్తులు, కొవ్వూరు డిపో నుంచి ఐదు బస్సుల్లో 154 మంది భక్తులు, నిడదవోలు డిపో నుంచి రెండు బస్సుల్లో 72 మంది, రాజమహేంద్రవరం డిపో నుంచి ఏడు బస్సుల్లో 238 మంది భక్తులు కుంభమేళాకు వెళ్లి వచ్చారు. మొత్తం 66,000 కిలోమీటర్ల మేర ఆర్టీసీ బస్సులను నడపడం ద్వారా జిల్లా ఆర్టీసీ రికార్డు సృష్టించింది.

గ్రేట్ అచీవ్‌మెంట్ ఇది



రాజమహేంద్రవరం అర్బన్, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): ప్రయాగ్‌రాజ్ మహాకుంభమేళాకు ఆర్టీసీ బస్సులను సక్సెస్‌ఫుల్‌గా నడపడం మాకు పెద్ద అచీవ్‌మెంట్. బస్సు డ్రైవర్లు, కో ఆర్డినేటర్లతో ఎప్పటికప్పుడు టచ్‌లో ఉంటూ సక్సెస్‌ఫుల్‌గా టూర్ పూర్తి చేశాం. అక్కడ కూడా తెలుగువాళ్లు ఉన్నారు. వాళ్లతో కాంటాక్టు పెంచుకుంటూ ఎప్పటికప్పుడు అక్కడి సమాచారం తెలుసుకుంటూ దానికి అనుగుణంగా చర్యలు తీసుకున్నాం. డ్రైవర్లు, సహకారం అందించిన అధికారులు, ఉద్యోగులను అభినందించే కార్యక్రమం చేపడతాం అని ఆర్టీసీ జిల్లా అధికారిణి షర్మిలా అశోక వెల్లడించారు. **- షర్మిలా అశోక, ఆర్టీసీ జిల్లా అధికారిణి**

కాకినాడ జిల్లా రూ.40.68 లక్షలు

ఈ ఏడాది జనవరి 31 నుంచి ఫిబ్రవరి 23 వరకు కుంభమేళాకు కాకినాడ జిల్లా నుంచి 14 బస్సులు భక్తులను సురక్షితంగా తీసుకెళ్లి తీసుకువచ్చాయి. ఇందుకుగాను ఆర్టీసీకి రూ.40.68 లక్షలు ఆదాయం వచ్చింది. కాకినాడ ఆర్టీసీ డిపో నుంచి కుంభమేళాకు బయలుదేరిన ప్రతీ బస్సు మధ్యాహ్నం ఒంటి గంటకు బయలుదేరి ప్రయాగ్‌రాజ్, వారణాసి, అయోధ్య, పూరి, కోణార్క్ వంటి ప్రాంతాలన్నీ భక్తులకు దర్శనార్థం తీసుకెళ్లి ఎనిమిదవ రోజు ఉదయం కాకినాడ డిపోకి చేర్చేవారు. భక్తులకు ఆర్టీసీ ఉదయం అల్పాహారం, మధ్యాహ్నం భోజనం, రాత్రి వేళలో టిఫిన్ ఇచ్చేవారు. కాగా కొవ్వూరు ఆర్టీసి డిపో నుంచి కుంభమేళాకు 5 బస్సుల్లో 162 మంది యాత్రికులను పంపించినట్టు డిపో మేనేజర్ వైవీవీఎస్ కుమార్ తెలిపారు. కుంభమేళా ప్రత్యేక సర్వీసుల ద్వారా కొవ్వూరు డిపోకు టిక్కెట్ల ద్వారా రూ. 19.75 లక్షల ఆదాయం రాగా, రూ. 10.20 లక్షలు ఖర్చులు అయ్యిందన్నారు. ప్రత్యేక సర్వీసుల ద్వారా కుంభమేళాకు వెళ్లిన భక్తులకు ఉదయం, రాత్రి అల్పాహారం, మధ్యాహ్నం భోజనం ఏర్పాటుచేశామన్నారు. ప్రతి బస్సులో మెడికల్ కిట్టుతో మెకానిక్, వంటమాస్టర్, భక్తుల సౌకర్యార్థం గైడ్‌ను ఏర్పాటుచేశామన్నారు. బస్సులో ఇద్దరు డ్రైవర్లు, డ్రైవర్ల నంబర్లతో కూడిన ఐడీ కార్డులను ప్రతి యాత్రికుడికి అందించి సురక్షితంగా యాత్రికులను తిరిగి ఇంటికి చేర్చడం జరిగిందన్నారు. ప్రయోగరాజ్‌లో జరుగుతున్న మహాకుంభ మేళాకు నిడదవోలు ఆర్టీసీ డిపో నుంచి రెండు సర్వీసులు నడిపినట్టు కాకినాడ డిపో మేనేజర్ కె.వెంకటేశ్వర్లు తెలిపారు.

రాజమహేంద్రవరం అర్బన్, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి) : బస్సుల్లోనే వంట మనుషులు, వంట సామగ్రి.. దర్శనీయ క్షేత్రం తెరిచే సమయానికి బస్సు చేరుకునేలా ప్రణాళిక.. దర్శనం చేసుకుని వచ్చేసరికి అల్పాహారం రెడీ.. మళ్లీ ప్రయాణం.. మధ్యలో భోజనం.. ఇలా పక్కా ప్లాన్‌తో కుంభమేళా టూర్‌ను ఆర్టీసీ అధికారులు సక్సెస్ చేశారు. గతంలో అయోధ్య బాలరాముని విగ్రహ ప్రతిష్ఠకు బస్సులను నడిపిన అనుభవం ప్రయాగ్‌రాజ్ కుంభమేళా టూర్‌కు ఎంతో ఉపయోగపడింది.

● ముందుగా కొవ్వూరు డిపో నుంచి..

ప్రయాగ్‌రాజ్ కుంభమేళాకు ముందుకు కొవ్వూరు డిపో నుంచి బస్సులు నడిపారు. ఆ తర్వాత రాజమహేంద్రవరం డిపోతో పాటు గోకవరం, నిడదవోలు, రావులపాలెం, కాకినాడ, మచిలీపట్నం, అనంతపురం, కర్నూలు నుంచి బస్సులు పెట్టారు. గతంలో కొవ్వూరు డిపో నుంచి ఒక రోజు యాత్రకు వచ్చిన భక్తుల ఫోన్ నెంబర్లతో ఒక వాట్సాప్ గ్రూపు క్రియేట్ చేయడం ఆర్టీసీ అధికారులకు ఎంతో ఉపయోగపడింది. కొవ్వూరు డీఎం కుమార్, ఏడీసీ సూర్యచంద్రరావు ఈ గ్రూప్ క్రియేట్ చేశారు. అలాగే, రాజమహేంద్రవరం డిపోకు చెందిన సీనియర్ డ్రైవర్ రామకృష్ణ గత కుంభమేళాకు వెళ్లి వచ్చిన అనుభవం ఈ టూర్‌కు బాగా కలసివచ్చింది. ముందుగా కొవ్వూరు డిపో నుంచి ఫిబ్రవరి 1న రెండు బస్సులు కుంభమేళాకు వెళ్లాయి. ఒక బస్సు ఫుల్ కావడంతో, ఆ వెంటనే పుష్‌బ్యాక్ స్లీపర్ బస్సు (నాన్ ఏసీ, స్టార్‌లైనర్) పెట్టారు. ఇలా కుంభమేళా టూర్‌కు మంచి రెస్పాన్స్ రావడంతో అన్ని డిపోల నుంచి బస్సులు వెళ్లాయి.

ఇష్టమైన మెనూ..

కుంభమేళా యాత్రలో భోజనాలు, దర్శనం, ఇతర సౌకర్యాలకు ఇబ్బంది లేకుండా రెండు, మూడు బస్సులు ఒకేసారి బయలుదేరేలా ప్లాన్ చేసుకున్నారు. వంట కోసం వంటమాస్టర్‌తోపాటు, ఒక మగ, ఇద్దరు మహిళలు (సహాయకులు)ను తీసుకెళ్లారు. వంట సామగ్రి అంతా వాళ్లే తెచ్చుకుంటారు. బస్సు ఆగిన టైంలో వంట చేసి పెడతారు. పూర్తి శాకాహార భోజనం అందించారు. ఉదయం టిఫిన్, మధ్యాహ్నం భోజనం, రాత్రి టిఫిన్ అందించారు. దీనికి ఒకరికి రోజుకు రూ.250 చొప్పున చెల్లించారు. పుష్‌బ్యాక్ సీట్లు కావడంతో బస్సు ప్రయాణంలో యాత్రికులకు ఎలాంటి ఇబ్బంది ఎదురుకాలేదు. బస్సులోనే రెస్ట్ తీసుకునేవారు. ప్రయాగ్‌రాజ్‌కు ఐదు కిలోమీటర్ల దూరంలో బస్సులను ఆపేసేవారు. అక్కడి నుంచి భక్తులు ఆటోలో వెళ్లి దర్శనం చేసుకుని తిరిగి పార్కింగ్ ప్రదేశానికి వచ్చేవారు. ఈ క్రమంలో సంబంధిత ఆర్టీసీ డిపో అధికారులు, టూర్ కో ఆర్డినేటర్లు ఎప్పటికప్పుడు మానిటరింగ్ చేయడంతో ఆర్టీసీ కుంభమేళా యాత్ర సక్సెస్‌ఫుల్‌గా సాగిందని చెప్పాలి.

బైక్‌పై ప్రయాగ్‌రాజ్‌కు
రౌతులపూడి నుంచి 1200 కి.మీ..



రౌతులపూడి, ఫిబ్రవరి22(ఆంధ్రజ్యోతి): అందరూ రైళ్లలో, బస్సుల్లో కుంభమేళాకు వెళితే, వీరు బైక్‌ల మీద వెళ్లి వచ్చారు. చాలామంది బస్సులు, కార్లు, రైళ్ల ప్రయాణం చేస్తూ కుంభమేళాకు వెళుతుండగా కాకినాడ జిల్లా రౌతులపూడి గ్రామానికి చెందిన యదగిరి శ్రీను, యర్రాశ్రీను, గోడి తాతాజీ, దివిలి సత్తిబాబులు రెండు బైక్ మీద ప్రయాగ్‌రాజ్‌కు వెళ్లారు. మూడు రోజులు ప్రయాణం చేసి రౌతులపూడి నుంచి ప్రయోగ్‌రాజ్‌కు 1200 కిలోమీటర్లు బైక్‌లపై ప్రయాణం చేశారు.

ప్రణాళికాబద్ధంగా నడిపాం..



కుంభమేళాకు వెళ్లే భక్తుల కోసం కాకినాడ జిల్లా నుంచి ప్రణాళికబద్ధంగా బస్సులు సిద్ధం చేశాం. భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలిగించకుండా వారికి ఆహార పదార్థాలు కూడా అందించాం. క్షేమంగా వెళ్లి క్షేమంగా తీసుకురావడంలో డ్రైవర్లు చక్కగా వ్యవహరించారు. దీని ద్వారా ఆర్టీసీకి కూడా రూ.40.68 లక్షలు ఆదాయం సమకూరింది.

- శ్రీనివాసరావు, ఆర్టీసీ జిల్లా ప్రజా రవాణాధికారి, కాకినాడ



మధ్యప్రదేశ్‌పై ఆంధ్రా విజయం



పోటీలో తలపడుతున్న క్రీడాకారులు

- బిహార్‌పై ఒడిస్సా
- ఢిల్లీపై హరియాణా
- తెలంగాణపై ఉత్తరాఖండ్
- కర్ణాటకపై ఒడిస్సా
- సిమ్లాపై కాన్పూర్
- ఉత్తరప్రదేశ్‌పై గుజరాత్ విజయం
- ముంబై-బెంగళూరు మ్యాచ్ డ్రా
- ఉత్సాహంగా కినాడలో ఆల్ ఇండియా సివిల్ సర్వీసెస్ హాకీ టోర్నమెంట్



కలెక్టరేట్/కార్పొరేషన్(కాకినాడ), ఫిబ్రవరి 22(ఆంధ్రజ్యోతి): కాకినాడ పట్టణం జిల్లా క్రీడా మైదానంలో జరుగుతున్న ఆల్ ఇండియా సివిల్ సర్వీసెస్ హాకీ టోర్నమెంట్ శనివారం ఉదయం నుంచి సాయంత్రం వరకు వివిధ రాష్ట్రాల మహిళలు, పురుషుల జట్లు మొత్తం 8మ్యాచ్‌లు జరిగాయి. రాష్ట్ర ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ చైర్మన్ వైడీ రామారావు, ఆంధ్రప్రదేశ్ ఒలింపిక్ అసోసియేషన్ సీఈవో గోవిందరాజు, ట్రస్ట్ ఆసుపత్రి చైర్మన్ రామకృష్ణ, డీఎస్‌డీవో శ్రీనివాస్‌కుమార్, హాకీ కోచ్ రవిరాజు పాల్గొన్నారు. ఒడిస్సా, బీహార్ సెక్రటేరియట్ మహిళ జట్ల మధ్య జరిగిన మ్యాచ్‌లో ఒడిస్సా సెక్రటేరియట్ జట్టు 7-0 తేడాతో విజయం సాధించింది. హరియాణా, ఢిల్లీ సెక్రటేరియట్ మహిళల జట్ల మధ్య జరిగిన మ్యాచ్‌లో హరియాణా సెక్రటేరియట్ 4-0 తేడాతో విజయం సాధించింది. తెలంగాణ సెక్రటేరియట్, ఉత్తరాఖండ్ సెక్రటేరియట్ మహిళల జట్టుల మధ్య జరిగిన మ్యాచ్‌లో ఉత్తరాఖండ్ 20-0 తేడాతో విజయం సాధించింది. ఒడిస్సా, కర్ణాటక సెక్రటేరియట్ జట్ల మధ్య జరిగిన మ్యాచ్‌లో ఒడిస్సా జట్టు 10-2 తేడాతో విజయం సాధించింది. ఆర్ఎస్సీ కాన్పూర్, ఆర్ఎస్సీ సిమ్లా జట్ల మధ్య జరిగిన మ్యాచ్‌లో ఆర్ ఎస్సీ కాన్పూర్ 2-0 తేడాతో గెలిచింది. ఆర్ ఎస్సీ ముంబై, ఆర్ఎస్సీ బెంగళూరు జట్ల మధ్య జరిగిన మ్యాచ్ ఇరు జట్లు 1-1 గోల్స్ నమోదు చేయడంతో మ్యాచ్ డ్రా అయింది. గుజరాత్, ఉత్తరప్రదేశ్ సెక్రటేరియట్ మధ్య జరిగిన మ్యాచ్‌లో గుజరాత్ సెక్రటేరియట్ 5-0 తేడాతో విజయం సాధించింది. ఆంధ్రప్రదేశ్, మధ్యప్రదేశ్ సెక్రటేరియట్ జట్ల మధ్య జరిగిన మ్యాచ్‌లో ఆంధ్రప్రదేశ్ సెక్రటేరియట్ 5-0 తేడాతో విజయం సాధించింది.



సాంస్కృతిక కార్యక్రమాల్లో కళాకారుల ప్రదర్శనలు



పోటీలో తలపడుతున్న క్రీడాకారిణులు

అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు

ఆలిండియా సివిల్ సర్వీసెస్ హాకీ టోర్నమెంట్‌లో భాగంగా జిల్లా క్రీడామైదానంలో శనివారం సాయంత్రం నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. కార్యక్రమాల్లో హరిప్రియ క్లాసికల్‌డాన్స్, దేవిస్తుతి, రాధాకృష్ణ కళాక్షేత్రం వారి నారాయణ క్లాసికల్, వినాయక కౌముది, తమిళ్, ఒడిస్సా, మధ్యప్రదేశ్, మహారాష్ట్ర, రాజస్థాన్, తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌కు చెందిన కళాకారులు పాటలు పాడుతూ నృత్యాలు చేశారు. జై జవాన్ జై కిసాన్, వందేమాతరం వంటి పాటలు ఆహుతులను ఆకట్టుకున్నాయి. వివిధ రాష్ట్రాల క్రీడాకారులు ఉత్సాహంగా పాల్గొని నృత్యాలు చేశారు. కాకినాడ పోస్టల్ క్లబ్ ఫౌండర్ రవిచంద్రప్రసాద్ నృత్య కళాకారిణి హరిప్రియకు రూ.5 వేలు చెక్కు అందజేశారు.





బాల్ కోసం పోటీ పడుతున్న క్రీడాకారిణులు



కళాకారిణి హరిప్రియకు నగదు ప్రోత్సాహకం అందజేస్తున్న రవిచంద్రప్రసాద్

పేద క్రీడాకారులకు హాస్టల్స్ ఏర్పాటు చేయాలి



ప్రతిభ ఉండి వెనుకబడిపోతున్న పేద క్రీడాకారుల కోసం హాస్టల్ సౌకర్యం ఏర్పాటు చేసి వారికి శిక్షణ ఇస్తే ఎంతో నైపుణ్యం కలిగిన క్రీడాకారులు తయారవుతారు. అలాగే క్రీడాకారుల కోసం మంచి శిక్షణ పొందిన కోచ్‌లను కూడా నియమించాలి. 2శాతం ఉన్న స్పోర్ట్స్ కోటాను 3శాతానికి పెంచి ముఖ్యమంత్రి చంద్రబాబు మంచి నిర్ణయం తీసుకున్నారు. దీని వల్ల ఎంతో మంది క్రీడాకారులకు మంచి భవిష్యత్ ఉంటుంది. స్మార్ట్‌సిటీ నిధులు రూ.18 కోట్లతో నిర్మించిన మల్టీపర్పస్ కన్వర్షన్ స్టేడియం వినియోగంలోకి తీసుకువస్తే క్రీడాకారులకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుంది. అలాగే త్వరలో జరగనున్న నేషనల్ బ్యాడ్మింటన్ టోర్నమెంట్‌కు కూడా కాకినాడ వేదికగా నిలిచే అవకాశాలున్నాయి.

-చుండ్రు గోవిందరాజులు, సీఈవో, ఆంధ్రప్రదేశ్ ఒలింపిక్ అసోసియేషన్

ప్రతీ మ్యాచ్‌ను నిశితంగా పరిశీలిస్తాం



మ్యాచ్ మొదలైన దగ్గర నుంచి చివరి వరకు క్రీడాకారులు వేసే గోల్స్‌ను చాలా నిశితంగా పరిశీలిస్తూనే ఉంటాం. మా నుంచి ఎటువంటి చిన్న పొరపాటు జరిగిన క్రీడాకారులు ఆయా జట్టు ఎంతో నష్టపోతాయి. అందుకనే ప్రతీ గోల్‌ను క్లీన్‌గా అబ్జర్వ్ చేస్తాం. టెక్నికల్ అఫీషియల్‌గా మ్యాచ్ మధ్యలో జరిగే గొడవల విషయంలో కూడా చాలా సమన్వయంతో క్రీడాకారులను కంట్రోల్ చేస్తూ మ్యాచ్‌ను ముందుకు తీసుకెళ్లాల్సి వస్తుంది. కొన్ని రాష్ట్రాల్లో మ్యాచ్ మధ్యలో లోకల్ వర్గస్ వచ్చి గొడవలు సృష్టిస్తుంటారు. అలాంటి సందర్భాల్లో పరిస్థితులు క్లిష్టంగా మారుతుంటాయి. అటువంటి సందర్భాల్లో పరిస్థితులు బట్టి ఫస్ట్ వార్నింగ్‌కు గ్రీన్‌కార్డు, క్రీడాకారులను కావాలని ఇబ్బంది పెడితే ఎల్లో కార్డు, క్రీడాకారుల మధ్య గొడవలు జరిగితే రెడ్‌కార్డు ఉపయోగించి క్రీడాకారులను మ్యాచ్ నుంచి బయటకు పంపిస్తాం.

-ఎం.అశోక్‌రెడ్డి, సీనియర్ టెక్నికల్ అఫీషియల్, ఫెడరేషన్ ఆఫ్ ఇంటర్నేషనల్ హాకీ

అంతరంగం పుస్తకావిష్కరణ



పుస్తకావిష్కరణలో మంత్రి దుర్గేష్, మాజీ మంత్రి డొక్కా, మాజీ ఎంపీ ఉండవల్లి, రచయిత శ్రీపాద

రాజమహేంద్రవరం కల్చరల్, ఫిబ్రవరి 22(ఆంధ్రజ్యోతి): విషయ పరిజ్ఞానంతో సాహిత్య పరంగా సాగే రచనలు ఉత్తమ సమాజ నిర్మాణానికి ప్రేరణగా నిలుస్తాయని రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్ అన్నారు. రచయిత శ్రీపాద శ్రీనివాస్ స్వీయ అనుభవాలతో రూపొందించిన అంతరంగం సంకలనాన్ని శనివారం స్థానిక ప్రకాశం నగర్ బుక్ బ్యాంక్‌లో ఏర్పాటు చేసిన సభకు దుర్గేష్‌తోపాటు మాజీ మంత్రి డొక్కా మాణిక్య వరప్రసాద్ ముఖ్యఅతిథిగా విచ్చేసి ఆవిష్కరించారు. మంత్రి మాట్లాడుతూ శ్రీపాద శ్రీనివాస్ హైదరాబాదులో సీఎల్పీ ఉద్యోగిగా, నాడు తనకు శాసన మండలిలో ఎంతో విషయ పరిజ్ఞానంతో విషయాలు అందించేవారని గుర్తు చేశారు. మాజీ ఎంపీ ఉండవల్లి అరుణ్‌కుమార్ మాట్లాడుతూ శ్రీపాద రచనల్లో సహజత్వం ఉట్టి పడుతుందన్నారు. ఈ సందర్భంగా శ్రీపాదను సత్కరించారు. కార్యక్రమంలో నాగర్ కర్నూల్ జిల్లా అచ్చంపేట ఎమ్మెల్యే సీహెచ్ వంశీకృష్ణ, మాజీ ఎమ్మెల్యేలు కంబం విజయరామిరెడ్డి, రౌతు సూర్యప్రకాశరావు, కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు టీకే విశ్వేశ్వరరెడ్డి, సీసీసీ ఛానల్ ఎండీ పంతం కొండలరావు, వక్కలంక నాగేంద్ర, అత్తిలి జగన్నాథం, చింతపెంట ప్రభాకర్, రామినీడి మురళి, షేక్ అసదుల్లా అహ్మద్ తదితరులు పాల్గొన్నారు.

ఉమాదేవికి రెండున్నర కిలోల వెండి చీర



వెండి చీరలో ఉమాదేవి అమ్మవారు

ఆలమూరు, ఫిబ్రవరి 22(ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా ఆలమూరు మండలం మూలస్థాన అగ్రహారంలోని ఉమా మూలేశ్వరస్వామి ఆలయంలోని ఉమాదేవి అమ్మవారికి వెండి చీరను భక్తులు బహూకరించారు. గ్రామానికి చెందిన పేరూరి మహేందర్‌నాథ్ దంపతులు రూ.3లక్షల విలువగల రెండున్నర కిలలో వెండితో తయారు చేయించిన తయారు చేయించిన చీరను శనివారం ప్రత్యేక పూజలు చేయించి ఆలయ కార్యనిర్వహణాధికారి ఎంఎస్ఆర్.కృష్ణ చేతుల మీదుగా మహేంద్రనాథ్ దంపతులు అందించి అమ్మవారికి అలంకరించారు. వెండి చీరను బహూకరించిన మహేంద్రనాథ్ దంపతులను పలువురు అభినందించారు.

భక్తవత్సల గోవిందా!
వెంకన్న ఆలయానికి పోటెత్తిన భక్తులు
స్వామివారి ఒక్కరోజు ఆదాయం రూ.51.61 లక్షలు



ఆత్రేయపురం, ఫిబ్రవరి 22(ఆంధ్రజ్యోతి): కోనసీమ తిరుమల వాడపల్లి శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయంలో మాఘ శనివారం భక్తజనం పోటెత్తారు. వేకువజామునే స్వామి వారికి సుప్రభాతసేవ, నీరాజన మంత్రపుష్పం, ఐశ్వర్యలక్ష్మీహోమం, బాలభోగం తదితర కార్యక్రమాలను శాస్త్రోక్తంగా నిర్వహించి స్వామివారిని వివిధ రకాల పుష్పాలతో అలంకరించారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు స్వామివారి తిరువీధుల్లో ఏడు ప్రదక్షిణలు నిర్వహించుకుని మొక్కులు తీర్చుకున్నారు. భారీ లైన్లలో స్వామివారిని దర్శించుకున్న భక్తులు తులభారాలు, కానుకలు సమర్పించుకుని అన్నప్రసాదం స్వీకరించారు. అనంతరం రాత్రి వివిధ సాంస్కృతిక ప్రదర్శనలు నిర్వహించారు. పలు సేవల ద్వారా స్వామి వారి ఒక్కరోజు ఆదాయం రూ.51.61 లక్షలు లభించినట్టు ఉపకమిషనరు నల్లం సూర్యచక్రధరరావు తెలిపారు. ఇదిలా ఉండగా స్వామిని బుల్లితెర నటీ వర్షి దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించుకున్నారు. వేదపండితుల ఆశీర్వచనం అందుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు. వర్షతో భక్తులు సెల్ఫీలు తీసుకున్నారు.

హెచ్ఎం వేధింపులతో ఉపాధ్యాయురాలి ఆత్మహత్యాయత్నం


అమలాపురంలో చికిత్స పొందుతున్న ఉపాధ్యాయురాలు లావణ్య

- అమలాపురం ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న ఉపాధ్యా యురాలు
- తోటి ఉపాధ్యాయులు, ఉపాధ్యాయ సంఘాల నిరసన
- హెచ్ఎం పాఠశాలలో ఉంటే మేం...పాఠాలు చెప్పలేం
- హెచ్ఎంను వెంటనే బదిలీ చేయాలని ఉపాధ్యాయుల పట్టు
- విచారణ అనంతరం చర్యలు ఉంటాయని డీఈవో ప్రకటన

పి.గన్నవరం, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): మన హెచ్ఎం వేధింపులు నేను భరించలేను.. నేను వెళ్లిపోతున్నాను అంటూ ఉదయం తన నివాసం నుంచి వీడియో కాల్‌లో తోటి ఉపాధ్యాయులకు చెబుతూ ఆత్మహత్యకు పాల్పడిన ఓ ఉపాధ్యాయురాలి వీడియో కాల్‌లో ఉన్న తోటి ఉపాధ్యాయులు, ఆమె భర్త అప్రమత్తం కావడంతో ప్రాణాలతో బయటపడి అమలాపురంలోని ఒక ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతుంది. దీంతో ఆ ఉపాధ్యాయురాలు పనిచేస్తున్న ముంగండ హైస్కూల్లో తోటి ఉపాధ్యాయులతోపాటు ఉపాధ్యాయ సంఘాల నాయకులు పాఠశాల ఆవరణలో బైఠాయించి హెచ్ఎంకు వ్యతిరేకంగా నిరసనకు దిగారు. వివరాలు ఇలా ఉన్నాయి... అమలాపురంనకు చెందిన డీఎస్‌డీ లావణ్య 2023జూన్‌లో ముంగండ హైస్కూల్లో బయోలాజికల్ ఉపాధ్యాయురాలిగా వచ్చారు. ఈక్రమంలో గత కొంతకాలంగా తరుచూ హెచ్ఎం జి.కనకదుర్గ వేధింపులకు గురిచేస్తుందని తీవ్ర వత్తిడికి గురవుతున్నానని తోటి ఉపాధ్యాయులతో చెప్పుకుంటూ వచ్చింది. ఈనేపథ్యంలో తోటి ఉపాధ్యాయుల గ్రూప్‌కు వీడియోకాల్ చేసి నేను వెళ్లిపోతున్నానని చెప్పి ఆత్మహత్యకు పాల్పడింది. వీడియోలో గమనించిన ఉపాధ్యాయులు అమలాపురంలోనే ఉన్న మరో ఉపాధ్యా యుడిని, భర్త మున్సిపాలిటీలో పనిచేస్తున్న ప్రసాద్‌ను అప్రమత్తం చెయ్యడంతో ఉరి వేసు కోవడానికి ప్రయత్నిస్తున్న లావణ్యను కిందికి దించారు.


ముంగండ హైస్కూల్లో నిరసన వ్యక్తం చేస్తున్న ఉపాధ్యాయులు, ఉపాధ్యాయసంఘాల నాయకులు

అస్వస్థతకు లోనవడంతో చికిత్స నిమిత్తం ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. విష యం తెలుసుకున్న పాఠశాల ఉపాధ్యాయులు, ఉపాధ్యాయసంఘాల నేతలు ముంగండ చేరుకుని నిరసన ప్రారంభించారు. హెచ్ఎంను వెంటనే బదిలీ చేయాలని లేకపోతే ఉపాధ్యా యులందరినీ ఈ స్కూలు నుంచి బయటకు పంపించాలని డిమాండ్ చేశారు. విషయం తెలుసుకుని డీఈవో సలీంబాషా ఆదేశాలమేరకు అక్కడకు చేరుకున్న డీసీఈబీ కార్యదర్శి బి.హనుమంతరావు, ఎంఈవోలు కె.హెలీనా, సిహెచ్ వీరభద్రానందం, మోకా ప్రకాష్, కె.వెంకటేశ్వ రరావులు ఉపాధ్యాయులతో మాట్లాడే ప్రయత్నం చేశారు. పాఠశాల ఉపాధ్యాయుల కార్యదర్శి మేథ్స్ టీచర్ కోట సత్యనారాయణ మాట్లాడుతూ హెచ్ఎం కనకదుర్గ 2023లో ముంగండ పాఠశాలకు వచ్చారని అప్పటి నుంచి వేధింపులకు గురిచేస్తున్నారని ఆరోపించారు. ఆత్మహత్యకు పాల్పడిన లావణ్య గతంలో రెండుసార్లు హెచ్ఎం వేధింపులకు తీవ్ర వత్తిడికి గురై గర్భస్రావం కూడా జరిగినట్లు చెప్పారని తెలిపారు. ఆత్మహత్య విషయం హెచ్ఎం దృష్టికి తీసుకువెళితే ఇదంతా డ్రామా అనిచెప్పి తోసిపుచ్చారని మండిపడ్డారు. ఆమెను బయటకు పంపి శాఖాపరమైన చర్యలు తీసుకునే వరకు విద్యార్థులకు పాఠాలు చెప్ప బోమని ఉపాధ్యాయులు తేల్చి చెప్పారు. ఇదే విషయాన్ని హనుమంతరావు డీఈవో దృష్టికి తీసుకువెళ్లగా హెచ్ఎంను పది రోజులు సెలవుపై వెళ్లాలని అప్పటివరకు ఇన్‌చార్జ్ హెచ్ఎంను నియమించాలని విచారణ అనంతరం చర్యలు ఉంటాయని ఆదేశాలు జారీ చేశారు. హెచ్ఎం సెలవుపై వెళ్లడంతో ఉపాధ్యాయులు నిరసన విరమించి క్లాస్‌రూమ్‌లకు వెళ్లారు. ఈ నిరసన కార్యక్రమంలో ఎస్టీయూ, యూటీఎఫ్ నాయకులు పోతంశెట్టి దొరబాబు, నాగిరెడ్డి శివప్రసాద్, సరిదే సత్యపళ్లంరాజు, ఎంటీయూ సుబ్బారావు, పింకే వెంకటేశ్వరావు, పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.


ముంగండ ప్రధానోపాధ్యాయురాలు కనకదుర్గ

నిబంధనలు పాటించడం వేధింపులా

- హెచ్ఎం జి.కనకదుర్గ

ప్రభుత్వ నిబంధనలు అనుసరించి నడుచుకోమనడం వేధింపుల్లా ఉన్నాయని హెచ్ఎం జి.కనకదుర్గ అన్నారు. ముంగండ పాఠశాలకు వచ్చే సరికి విద్యార్థులు బాగా వెనుకబడి ఉన్నారని వారిని గాడిలో పెట్టేందుకే ప్రయత్నం చేస్తున్నానని ఆ తరహా పనులు ఉపాధ్యాయులకు ఇబ్బందికరంగా ఉన్నాయని చెప్పుకొచ్చారు. వెనుకడిన విద్యార్థులకు అక్షరాలు నేర్పమంటే తప్పా అని ఆమె ప్రశ్నించారు. ఏ పాఠశాలలోను ఈరకమైన చర్యలు తీసుకోవడంలేదని మీరు ఎందుకు చేస్తున్నారని ఉపాధ్యాయులు నన్ను ప్రశ్నించారని ఆమె వాపోయారు. ఉపాధ్యాయురాలు ఆత్మహత్యకు నాకు సంబంధంలేదని ఏకారణాలు వలన చేసుకున్నారో తెలియదనిఆమె స్పష్టం చేశారు.

శుభకార్యానికి వెళుతూ ... రోడ్డు ప్రమాదం

- వేగాయమ్మపేట వద్ద విరిగిన మినీ వ్యాను యాక్సిల్.. ఊడిన చక్రం
- వ్యానులో వెళుతున్న 39 మందికి గాయాలు
- ఒకరి పరిస్థితి విషమం


కాకినాడ ప్రభుత్వ ఆసుపత్రికి తరలిస్తున్న జాలెం వీరవేణి, ఏరియా ఆసుపత్రిలో చికిత్సపొందుతున్న క్షతగాత్రులు, ప్రమాదానికి గురైన వ్యాను

ద్రాక్షారామ, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): రామచంద్రపురం మండలం వేగాయమ్మపేట వద్ద శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో శుభకార్యానికి వెళుతున్న 39 మంది గాయపడ్డారు. అందులో ఒక మహిళపరిస్థితి విషమంగా ఉంది. మండలంలో తోటపేట శివారు గాంధీనగర్‌కు చెందిన 40మంది మసకపల్లిలో జరిగే శుభకార్యానికి వ్యానులో వెళుతుండగా ప్రయాణిస్తున్న వ్యాను వెనుక యాక్సిల్ విరగడంతో కుడివైపు చక్రం ఊడిపడి ప్రయాణిస్తున్న వారు గాయపడ్డారు. పోలీసులు, క్షతగాత్రులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. శనివారం ఉదయం11 గంటల ప్రాంతంలో గాంధీనగర్‌కు చెందిన 33 మంది వరకు మహిళలు, ముగ్గురు పురుషులు, ఇరువురు బాలురు, ఒక బాలిక మసకపల్లిలో జరిగే శుభకార్యానికి అశోక్ లైలాండ్ మినీ వ్యానులో బయలు దేరారు. బయలుదేరిన కొద్ది నిమిషాల్లో గాంధీనగర్ దాటి వేగాయమ్మపేట చర్చి ప్రాంతానికి చేరేసరికి మినీ వ్యాను వెనుక కుడివైపు చక్రం యాక్సిల్ విరిగిపోయింది. దీంతో చక్రం ఊడిపడింది. వ్యాను అదుపుతప్పి వ్యానులో ప్రయాణిస్తున్న వారు ఒకరిపై ఒకరు పడ్డారు. వ్యాను కొంతదూరంవరకు వెళ్లడంతో ప్రయాణిస్తున్న వారికి గాయాలయ్యాయి. స్థానికులు క్షతగాత్రులను 108 అంబులెన్సుల్లో రామచంద్రపురం ఏరియా ఆసుపత్రికి తరలించారు. ప్రమాద ఘటన తెలుసుకున్న మంత్రి సుభాష్ కూటమి నాయకులు, ఏరియా ఆసుపత్రి వైద్యులను అప్రమత్తం చేశారు. క్షతగాత్రులు రెండు అంబులెన్సులు, మరో రెండు వాహనాల్లో ఏరియా ఆసుపత్రికి చేరుకున్నారు. అప్పటికే ఏరియా ఆసుపత్రికి చేరుకున్న జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి పోలిశెట్టి చంద్రశేఖర్, గొల్లపల్లి కృష్ణ, టీడీపీ సీనియర్ నాయకులు వాసంశెట్టి సత్యంలు ఆసుపత్రి సిబ్బంది క్షతగాత్రులను వాహనాల నుంచి ఆసుపత్రిలో చేర్చారు. సూపరింటెండెంట్ డా.ప్రవీణ్, వైద్యులు, సిబ్బంది 39 మంది క్షతగాత్రులకు బెడ్‌లు కేటాయించి ప్రథమ చికిత్స అందించారు. క్షతగాత్రుల్లో జాలెం వీరవేణికి తలకు తీవ్రగాయాలు కావడంతో కాకినాడ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అల్లంపల్లి భారతి చేయి విరగడంతో కాకినాడలో ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. క్షతగాత్రులను ఆర్డీవో అఖిల, డీఎస్పీ రఘువీర్‌లు పరామర్శించారు.

బావిలో పడి వ్యవసాయ కూలీ మృతి

ప్రత్తిపాడు, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి) ప్రమాదవశాత్తూ వ్యవసాయ పొలంలోని బావిలో పడి వ్యవసాయ కూలి మృతి చెంది న సంఘటన శనివారం సాయంత్రం కాకినాడ జిల్లా ప్రత్తిపాడు మండలం పెదశంకర్లపూడి గ్రామంలో జరిగింది. పోలీసులు అం దించిన సమాచారం మేరకు.. పెదశంకర్లపూడి గ్రామానికి చెందిన అంకం సుబ్రహ్మణ్యం (48) వ్యవసాయ కూలి పనులు చేసుకుంటూ జీవనోపాధి పొందుతున్నాడు. ఈ క్రమంలో శనివారం బావిలో నీరు తోడుతుండగా ప్ర మాదవశాత్తూ బావిలో పడి మృతి చెందాడు. మృతుడికి భార్య వెంకటలక్ష్మి, ఇద్దరు కుమార్తెలు, కుమారుడు ఉన్నారు. సుబ్రహ్మణ్యం భార్య వెంకటలక్ష్మి ఫిర్యాదు మేరకు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం స్థానిక ఆసుపత్రికి తరలించారు. ప్రత్తిపాడు పోలీసులు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు.

తునిలో చిన్నారిపై అత్యాచారయత్నం

తునిరూరల్, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): తుని పట్టణంలో దారుణం చోటుచేసుకుంది. పట్టణలో ఓ కుటుంబం కూలి పనికి వెళ్లగా అదే కుటుంబానికి చెందిన ఐదేళ్ల చిన్నారిని తుని పట్నానికి చెందిన ఓ యువకుడు కేక్ కొనిస్తానన్నాడు. ఐదేళ్ల చిన్నారిని నమ్మబలికి అత్యాచారానికి యత్నించినట్లు బాలిక తల్లి దండ్రులు ఇచ్చిన ఫిర్యాదుమేరకు కేసు నమోదు చేసినట్లు సీఐ గీతా రామకృష్ణ తెలిపారు. ఘటనపై కేసు నమోదుచేసిన పోలీసులు ఫోక్స్ యాక్ట్‌తోపాటుగా ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసునమోదు చేసినట్లు సీఐ వివరించారు.

భక్తుల సౌకర్యాలపై దృష్టి పెట్టాలి

- అన్నవరం దేవస్థానం ఈవో సుబ్బారావు

అన్నవరం, ఫిబ్రవరి 22(ఆంధ్రజ్యోతి): అన్నవరం దేవస్థానంలో ఆదాయ మార్గాల అన్వేషణ కంటే భక్తులకు సౌకర్యాల కల్పనపై దృష్టి సారించాలని ఈవో వీర్ల సుబ్బారావు పేర్కొన్నారు. శనివారం ప్రకాష్‌సదన్ పాలకమండలి సమావేశపుహాలులో దేవస్థానం ఏఈవోలు, సూపరింటెండెంట్‌లు, ఇంజనీరింగ్ అధికారులతో సమావేశమయ్యారు. ప్రధానంగా ఇటీవల ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఐవీఆర్ఎస్ సర్వేలో అన్నవరం దేవస్థానం చివరిస్థానంలో ఉండడంతో దీనిని మెరుగుపరిచేందుకు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. సోమవారం జిల్లా కలెక్టర్ అన్నవరం దేవస్థానం అధికారులందరితో సమావేశమవుతున్నందున ప్రతి విభాగ సిబ్బంది పూర్తిసమాచారంతో ఉండాలని సూచించారు. ప్రధానంగా రత్నగిరిపై షాపు లీజుదారులు భక్తులపట్ల అమర్యాదగా, చిరాకుగా వ్యవహరిస్తున్నారనే ఫిర్యాదులు అధికంగా ఉన్నాయని లీజుదారులు హద్దుమీరితే చర్యలు తీసుకోవాలన్నారు. వ్రతపురోహితులు సైతం భక్తులపట్ల వ్యవహరించే తీరుపై వారి సందేహాలను నివృత్తిచేయడంలో సరిగా పనిచేయడంలేదని పనితీరు మార్చుకునేవిధంగా వ్రతవిభాగ అధికారులు దృష్టిపెట్టాలని అన్నారు. అదేవిధంగా సౌకర్యాల కల్పన విషయంలో పశ్చిమరాజగోపురం ఎదురుగా దాత సహకారంతో నిర్మించ తలపెట్టిన షెడ్డును ఈవేసవి సమీపించేలోపు పూర్తిచేయించాలని సిబ్బంది ఈవోకు సూచించారు. మరోపక్క మరుగుదొడ్లు నిర్మించాల్సిన అవసరం ఉందన్నారు. సత్రంగదుల నిర్వహణపై ఎప్పటికప్పుడు, దుప్ప ట్లు మార్చడం, నీటి కష్టాలు లేకుండా చూడాలన్నారు. కార్యక్రమంలో పీఆర్వో కృష్ణారావు, ఏఈ వోలు శ్రీనివాస్, కొండలరావు, ఇంజనీరింగ్ అధికారులు రామకృష్ణ, నూకరత్నం, సూపరిం టెండెంట్‌లు బలువ సత్యశ్రీనివాస్, అనకాపల్లి ప్రసాద్ పాల్గొన్నారు.


పీఆర్వో కృష్ణారావుకు విరాళం అందజేస్తున్న దాత

నిత్యాన్నదాన పథకానికి రూ.లక్ష విరాళం

అన్నవరం దేవస్థానంలో ప్రతిష్టాత్మంగా నిర్వహిస్తున్న సత్యదేవ నిత్యాన్నదాన పథకానికి శనివారం ఒకదాత రూ.లక్ష విరాళంగా సమర్పించారు. విశాఖపట్టణానికి చెందిన గేదెల వరలక్ష్మి ఈ మొత్తాన్ని ఆలయ పీఆర్వో కృష్ణారావుకు అందజేయగా దాతను ఆయన అభినందించి వారికి స్వామివారి ప్రసాదం, ప్రత్యేకదర్శన సౌకర్యం కల్పించారు.

'లోవ' క్షేత్రానికి అంతర్జాతీయ గుర్తింపు


తలుపులమ్మ లోవ ప్రాంగణం

తునిరూరల్, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లాలో ప్రసిద్ధి పుణ్యక్షేత్రం లోవ దేవస్థానానికి అంతర్జాతీయ గుర్తింపు లభించినట్లు ఆలయ ఈవో పి.విశ్వనాథ్‌రాజు తెలిపారు. తిరుపతిలో 3 రోజులపాటు జరిగిన ఇంటర్నేషనల్ టెంపుల్ సమ్మిట్‌లో రాష్ట్రంలో పలు ఆలయాలతో పాటుగా తలుపులమ్మ ఆలయంపై వివరించి ప్రదర్శించామన్నారు. 150 దేశాల ప్రతినిధులు లోవ ఆలయాన్ని సందర్శించారని ఈవో వివరించారు. రాష్ట్రంలో ప్రప్రథమంగా ఆలయంలో ఎక్స్‌లేటర్ ఏర్పాటు, ఆలయ పునః నిర్మాణ పనులపై సమ్మిట్‌లో వివరించామని తెలిపారు.

పర్యావరణ పరిరక్షణ కోరుతూ సైకిల్ యాత్ర

- 29,650 కిలోమీటర్లు యాత్ర పూర్తిచేసిన ముత్తుసెల్వన్


సైకిల్‌యాత్ర చేస్తున్న ముత్తుసెల్వన్

మామిడికుదురు, ఫిబ్రవరి 22(ఆంధ్రజ్యోతి): పర్యావరణ పరిరక్షణ కోరుతూ తమిళనాడులోని కొయంబత్తూరుకు చెందిన ముత్తుసెల్వన్ ఆసియా దేశాల్లో సైకిల్ యాత్ర చేపట్టాడు. ఎనిమిది ఆసియా దేశాల్లో యాత్ర చేసే విదంగా 2021 డిసెంబరు 21న యాత్రకు శ్రీకారం చుట్టి ఇప్పటివరకు మూడు దేశాల్లో 29,650 కిలోమీటర్లను 1150 రోజుల్లో పూర్తిచేశారు. బంగ్లాదేశ్, నేపాల్‌తోపాటు ఇండియాలో సైకిల్‌యాత్ర పూర్తయిందని, ఇండియాలో పూర్తవుతుందన్నారు. కరోనా సమయంలో ఆక్సిజన్ లేక అనేకమంది మరణాలు సంభవించడం చూసి చెట్లు నాటే విదంగా ఈ యాత్రను నిర్వహిస్తున్నానని, ప్రతీ గ్రామంలోను చెట్లు నాటే విదంగా స్థానిక అధికారులతో మాట్లాడుతున్నట్లు తెలిపారు. 44వేల కిలోమీటర్లతో తన యాత్ర పూర్తవుతుందని, 2027 డిసెంబరు 21 నాటికి యాత్రను పూర్తి చేస్తానని తెలిపారు. సెల్వన్ శనివారం మామిడికుదురు చేరుకుని నగరం ఎస్ఐ చైతన్యకుమార్, తహశీల్దార్ సుబ్రహ్మణ్యాచార్యులను కలుసుకుని యాత్ర విశేషాలను తెలిపాడు.

చోరీ కేసుల్లో ఐదుగురి అరెస్టు

కడియం, ఫిబ్రవరి 22(ఆంధ్రజ్యోతి): తూర్పు గోదావరిజిల్లా కడియం మండలంలోని పలు గ్రామాల్లో చోరీలకు పాల్పడిన ఐదుగురు నిందితులను పోలీసులు అరెస్టు చేశారు. కడియం పోలీసుస్టేషన్‌లో శనివారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో డీఎస్పీ భవ్యకిషోర్ వివరాలను వెల్లడించారు. జేగురుపాడులో జి.సత్యవతి గుడికి వెళ్లి వస్తుండగా ఇద్దరు దుండగులు ఆమె నోరు మూసి మెడలో బంగారు మంగళసూత్రాలు లాక్కుపోయినట్టు కడియం పోలీసులకు ఫిర్యాదు అందింది. అలాగే జేగురుపాడు, మురమండ, బుర్రిలంక, దుళ్ల గ్రామాల్లో చోరీలు జరిగినట్టు ఫిర్యాదులొచ్చాయి. వీటిపై సీఐ ఎ.వెంకటేశ్వరరావు, ఎస్ఐ బీఎన్ దుర్గాప్రసాద్ దర్యాప్తు చేపట్టారు. నల్లజర్ల మండలం అవుపాడు గ్రామంలో ఉంటున్న మాధవరాయుడుపాలేనికి చెందిన కొత్తపల్లి త్రిమూర్తులు, పిఠాపురం మండలం విరవాడకు చెందిన కూరాకుల సుబ్బారావు, కపిలేశ్వరపురం మండలం వల్లూరులో ఉంటున్న మాధవరాయుడుపాలేనికి చెందిన గాదంశెట్టి వెంకన్న, మండపేట మండలం కేశవరానికి చెందిన పచ్చ రాజు, రామచంద్రపురం బాడీపేటకు చెందిన గుమ్మడి సత్యనారాయణమూర్తిలను అరెస్టు చేశారు. అలాగే మండపేట రూరల్ పోలీస్‌స్టేషన్‌కు సంబంధించి రెండు, రాజానగరం స్టేషన్‌కు సంబంధించి నాలుగు చోరీ కేసు ల్లో సొత్తును స్వాధీనం చేసుకున్నట్టు తెలిపారు. నిందితుల నుంచి 58 గ్రాముల బంగారు ఆభరణాలు, జత వెండి పట్టీలు, ఓ బైక్, కాపర్‌వైరు, రూ.50 వేల నగదును స్వాధీనం చేసుకున్నట్టు తెలిపారు. మొత్తం విలువ సుమారు రూ.5,40,000 ఉంటుందని డీఎస్పీ తెలిపారు.

కాశీ అంతిమయాత్రలో పాల్గొన్న ప్రముఖులు


పాడె మోస్తున్న టీడీపీ ఆర్గనైజింగ్ కార్యదర్శి మెట్ల రమణబాబు, శరత్

అమలాపురం, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): విశ్రాంత వ్యాయామోపాధ్యాయుడు, అంతర్జాతీయ బ్యాడ్మింటన్ క్రీడాకారులు సాత్విక్‌సాయిరాజ్ తండ్రి రంకిరెడ్డి కాశీవిశ్వనాథం అంతిమయాత్ర శనివారం జరిగింది. గాంధీబజార్‌లోని ఆయన స్వగృహంవద్ద నుంచి వందలాది మంది క్రీడాభిమానులు, పురప్రముఖులు, జాతీయ అసోసియేషన్‌ల ప్రతినిధులు, అంతర్జాతీయ క్రీడాకారులు అంతిమయాత్రలో పాల్గొన్నారు. గాంధీబజార్ నుంచి ప్రత్యేక వాహనంలో కాశీవిశ్వనాథం భౌతికకాయాన్ని ఉంచి అంతిమ యాత్రను ప్రారంభించారు. మాచిరాజువీధి, రవణంవీధి, గుండువీధి మీదుగా మెయిన్‌రోడ్డుకు చేరుకుని అక్కడి నుంచి ఆయన కళల సౌధమైన ఆఫీసర్స్ రిక్రియేషన్ క్లబ్‌కు చేరుకుంది. అక్కడ కొద్దిసేపు కాశీ భౌతికకాయాన్ని ఉంచారు. అక్కడి నుంచి మార్కెట్‌లోని హిందూ శ్మశానవాటికకు తరలించారు. మార్కెట్ ఏరియా నుంచి కాశీ భౌతికకాయాన్ని టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి మెట్ల రమణబాబు, అసోసియేషన్ ప్రతినిధి ఆల్లాడ శరత్ తదితరులు పాడెని మోశారు. అంతిమయాత్రలో బ్యాడ్మింటన్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా మాజీ కార్యదర్శి పున్నయ్యచౌదరి, ఏపీపీఏ కార్యదర్శి అంకమ్మచౌదరి, టెక్నికల్ పర్సన్ ప్రసాద్, సాత్విక్‌సాయిరాజ్ జోడి అయిన చిరాగ్‌శెట్టి, అంతర్జాతీయ క్రీడాకారుడు కిడాంబి శ్రీకాంత్, కోచ్ టోని, ప్రముఖులు నల్లా పవన్‌కుమార్, చిక్కాల గణేష్ తదితరులు పాల్గొన్నారు. అంతిమయాత్ర అనంతరం సాత్విక్‌సాయిరాజ్‌ను కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావుతోపాటు పలువురు ప్రముఖులు పరామర్శించారు.

భార్యను కత్తితో నరికి చంపిన భర్త అరెస్టు

కొవ్వూరు, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): కత్తితో భార్యను నరికి చంపిన వ్యక్తిని అరెస్టు చేసినట్టు కొవ్వూరు పట్టణ సీఐ పి.విశ్వం తెలిపారు. కొవ్వూరు మండలం వాడపల్లి బంగారమ్మపేటలో భార్య, మామపై కొబ్బరి బొండాలు కొట్టే కత్తితో దాడిచేసిన కేసులో నిందితుడిని గంద్ర మురళీకృష్ణచౌదరిని శనివారం కొవ్వూరు పాత రైలు వంతెన (హేవలాక్ బ్రిడ్జి) వద్ద అరెస్టు చేశామన్నారు. ఈనెల 20న కుటుంబ తగాదాల నేపథ్యంలో బంగారమ్మపేటకు చెందిన గంద్ర కృష్ణతులసి (37)ను భర్త ఎన్టీఆర్ జిల్లా తిరువూరు మండలం రాజుగూడెంనకు చెందిన గంద్ర మురళీకృష్ణచౌదరి కత్తితో నరకడంతో అక్కడికక్కడే మృతి చెందింది. అడ్డువచ్చిన కృష్ణతులసి తండ్రి అడ్డాల నాగేశ్వరరావును కత్తితో దాడి చేసి గాయపర్చాడు. దీనిపై మృతురాలి సోదరుడు అందించిన ఫిర్యాదుపై కేసు నమోదు చేశారు. దర్యాప్తులో భాగంగా శనివారం గంద్ర మురళీకృష్ణచౌదరిని కొవ్వూరు పట్టణంలోని పాత రైలు వంతెన వద్ద అరెస్టుచేసినట్టు సీఐ విశ్వం తెలిపారు. రిమాండ్ నిమిత్తం కోర్టులో హాజరుపర్చామన్నారు.

వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ముగ్గురి మృతి

శనివారం జరిగిన వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ముగ్గురు మృతి చెందారు. అల్లూరిజిల్లా ఎటపాక మండలం లక్ష్మీపురం సమీపంలో జరిగిన ప్రమాదంలో ఒడిశావాసి మృతిచెందాడు. అలాగే కాకినాడజిల్లా సామర్లకోట మండలం మేడపాడు వద్ద బైక్ అదుపుతప్పి ఒక వ్యక్తి మృతి చెందాడు. తొండంగి మండలం అన్నయ్యపేటవద్ద బీచ్ రోడ్డులో జరిగిన ప్రమాదంలో యువకుడు మృతిచెందాడు.

టాటా మ్యాజిక్ వాహనం ఢీకొని ఒడిశా వాసి మృతి


ప్రమాదంలో మృతి చెందిన బజారి

ఎటపాక, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): ఎదురుగా వస్తున్న స్కూటీని టాటా మ్యాజిక్ వాహనం ఢీకొన్న ఘటనలో ఒడిశావాసి మృతి చెందాడు. ఈసంఘటన శనివారం అల్లూరిజిల్లా ఎటపాక మండలం లక్ష్మీపురం సమీపంలో విజయవాడ-జగదల్‌పూర్ జాతీయ రహదారిపై చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఒడిశా రాష్ట్రం మల్కాజ్‌గిరి జిల్లా బీనాయక్‌పూర్ గ్రామంనకు చెందిన వండా బజారి (38)తెలంగాణ రాష్ట్రం భద్రాచలంలో పేయింటింగ్ కార్మికుడిగా పనిచేస్తున్నాడు. ఇటీవల స్వగ్రామంకు వెళ్లిన అతను ఈనేపథ్యంలో తిరిగి స్కూటీపై బీనాయక్‌పూర్ నుంచి భద్రాచలం వస్తున్నాడు. భద్రాచలంవైపు నుంచి ఏడుగురాళ్ల పల్లి వెళ్తున్న టాటా మ్యాజిక్ లక్ష్మీపురం గ్రామ శివారులోని మలుపువద్ద ఎదురుగా వస్తున్న స్కూటీని ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో బజారి తలకు తీవ్రగాయాలై అక్కడికక్కడ దుర్మరణం చెందాడు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మోటార్‌సైకిల్ నుంచి పడి వ్యక్తి మృతి

సామర్లకోట, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): కాకినాడజిల్లా సామర్లకోట మండలం జీమేడపాడు కెనాల్ రోడ్లో వేట్లపాలెం- జీమేడ పాడు గ్రామాల మధ్య వేగంగా వెళుతున్న మోటార్‌సైకిల్ నుంచి అదుపుతప్పి రోడ్డుపై పడిపోవడంతో తలకు బలమైన గాయాలు అయ్యి అక్కడికక్కడే మృతి చెందిన సంఘటన శనివారం సాయంత్రం జరిగింది. పోలీసుల సమాచారం మేరకు.. సామర్లకోట రాజీవ్ గృహకల్ప వద్ద నివాసం ఉంటున్న పెద్దాపురం నారాయణ కళాశాలలో పీఆర్వోగా పనిచేస్తున్న నగరం సత్తిబాబు(42) సామర్లకోట నుంచి మోటార్ సైకిల్‌పై తన అత్తగారిల్లు అయిన పెదబ్రహ్మదేవం వెళుతుండగా లిఫ్ట్ ఇరిగేషన్ స్కీం సమీపాన అదుపుతప్పి రోడ్డుపై పడిపోయాడు. స్థానికులు అందించిన సమాచారంతో సామర్లకోట పోలీసులు సంఘటనా స్థలికి చేరుకుని అతని వద్ద లభించిన చిరునామా మేరకు సామర్లకోటలో ఉన్న కుటుంబసభ్యులకు సమాచారం అందించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పెద్దాపురం తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు పోలీసులు తెలిపారు.

బైకులు ఢీకొని యువకుడి మృతి


రోడ్డు ప్రమాదంలో మరణించిన యువకుడు

తొండంగి, ఫిబ్రవరి22 (ఆంధ్రజ్యోతి): తొండంగి మండలం అన్నయ్యపేటవద్ద బీచ్ రోడ్డుపై శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒంటిమామిడి గ్రామానికి చెందిన దారాబాల రాజు (18) దుర్మరణం చెందాడు. పోలీసుల వివరాల ప్రకారం.. రాజు తన బావను వేమవరం వద్ద దింపేందుకు హంటర్ స్పోర్ట్స్ బైక్‌పై వెళ్లి దింపి తిరిగి వస్తున్నాడు. అదే సమయంలో ఒంటిమామిడి వైపు నుంచి అన్నయ్యపేట వైపు రాయల్‌ఎన్‌ఫీల్డ్ వాహనంపై వెళ్తున్న గరికిన రాము, రాజు స్పోర్ట్స్ బైక్ ఎదురెదురుగా ఢీకొన్నాయి. ఇద్దరికి తీవ్ర గాయాలు కావడంతో తుని ఏరియా ఆసు పత్రికి తరలించగా దారాబాల రాజు అప్పటికే మృతిచెందినట్టు వైద్యులు ధ్రువీకరించారు. గరికిన రాము కాలు విరిగింది. రాజు తాపీ పని చేసేవాడు. తొండంగి హెడ్ కానిస్టేబుల్ పాండురంగ కేసు నమోదు చేశారు.

జీజీహెచ్‌లో మరో జీబి సిండ్రోమ్ కేసు

జీజీహెచ్ (కాకినాడ), జనవరి 22 (ఆంధ్రజ్యోతి):కాకినాడ జీజీహెచ్‌లో మరో గులియన్- బారే సిండ్రోమ్ (జీబీఎస్) కేసు నమోదైనట్లు ఆసుపత్రి న్యూరాలజీ ఇన్‌చార్జ్ హెచ్‌వోడి డా. ఎండీ షరీఫ్ తెలిపారు. శనివారం నమోదైన కేసుతో కలిపి మొత్తం ఐదుగురు జీజీహెచ్‌లో చికిత్స పొందుతున్నట్లు పేర్కొన్నారు. తీవ్రమైన నీరసం, కాళ్ళుచేతులు తిమ్మిర్లు, కండరాల బలహీనత, జ్వరం, శ్వాసకోస సమస్యలు, వాంతులు, విరోచనాలు వంటి లక్షణాలు కనబడితే ఆందోళన చెందకుండా సంబంధిత అర్హులైన వైద్యుడిని సంప్రదించాలన్నారు. జీజీహెచ్‌లో జీబీఎస్ కేసులకు సంబంధించి వైద్య చికిత్స, మందులు, మౌళిక సదుపాయాలు పూర్తిస్థాయిలో ఉన్నాయన్నారు.

రసవర్గాల కొనుగోలుపై ఫుడ్‌సేఫ్టీ క్వాలిటీ పరిశీలన

అన్నవరం, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): అన్నవరం దేవస్థానంలో వివిధ అవసరాలకు కొనుగోలుచేసే రసవర్గాలైన గోదుమలు, పప్పులు, పంచదార, తదితర సరుకుల నాణ్యతకు సంబంధించి శనివారం ఆహారనియంత్రణ (ఫుడ్‌సేఫ్టీ) అధికారులు పర్యవేక్షణ చేశారు. ఈనెల 27న వీటి కొనుగోలుకు టెండర్లు పిలవనున్న నేపథ్యంలో ఏ రకాలు నాణ్యతగా ఉంటాయి వాటి ధరలు ఏవిధంగా ఉంటాయి అనే దానిపై సెంట్రల్‌స్టోర్స్ అధికారులు వారిని అడిగి తెలుసుకున్నారు. టీటీడీలో నెయ్యి వినియోగంపై ఆరోపణలు రావడంతో అప్పటి నుంచి అన్నవరం దేవస్థానం కొనుగోలుచేసే ముడిపదార్థాలను, అన్నిరకాల వస్తువులను వీరు తనిఖీ చేపట్టిన తరువాతనే కొనుగోలు చేస్తున్నారు. దేవస్థానంలో వీటి కొనుగోలుకు సంబంధించి ప్రతి ఆరు నెలలకు టెండర్లు పిలిచి దేవదాయకమిషనర్ ఆమోదంతో క్వాలిటీ వస్తువులు తక్కువ ధరకు టెండర్ కోడ్ చేసినవారికి సరఫరాకు అనుమతిస్తారు. ఆహార నియంత్రణ అధికారులు సుబ్బారావు, శ్రీనివాస్‌లు పాల్గొన్నారు.

ఆర్అండ్‌బి పనుల్లో లోపాలు ఉంటే రికవరీ చేస్తాం

- ఆర్అండ్‌బి క్వాలిటీ కంట్రోల్ సీఈ వెంకటేశ్వరరావు

పి.గన్నవరం, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): ఆర్అండ్‌బీ పనులు నాణ్యతలో లోపాలు ఉంటే సంబంధిత కాంట్రాక్టర్ నుంచి డబ్బులు రికవరీకి ప్రభుత్వానికి సిఫార్సు చేస్తామని ఆర్అండ్‌బీ క్వాలిటీ కంట్రోల్ సీఈ జి.వెంకటేశ్వరరావు అన్నారు. పి.గన్నవరం-అమలాపురం ఏజీ రోడ్డులో సీసీ రోడ్డు నాణ్యతను ఆయన పరిశీలించి అనంతరం మాట్లాడారు. రాష్ట్రవ్యాప్తంగా ఆర్అండ్‌బీకి సంబంధించిన 100 పనులు పూర్తయ్యాయని వాటిని క్వాలిటీ కంట్రోల్ పరిశీలన చేస్తున్నామని చెప్పారు. ప్రతి ప్రాజెక్టును పూర్తిస్థాయిలో పరిశీలన చేసి వాటి క్వాలిటీలో లోపా ల తీవ్రతను బట్టి కొన్ని చోట్ల డబ్బులు రికవరీచేస్తే మరికొన్ని చోట్ల మరమ్మతులకు సూచనలు చేస్తామన్నారు. కొన్నిచోట్ల ఆయా ప్రాజెక్టును బట్టి తీసుకోవాల్సిన జాగ్రత్తలను సూచిస్తామన్నారు. ఇటీవలే పూర్తయిన ఆర్అండ్‌బీ సీసీ రోడ్లు, బీటీ రోడ్లును క్వాలిటీ కంట్రోల్ బృందం అధికారులు పరిశీలించి స్థానిక అధికారులకు పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. సీఈతోపాటు క్వాలిటీ కంట్రోల్ ఎస్ఈ జీవీ భాస్కరరావు, ఈఈ జి.శ్రీనివాస్‌నాయక్, డి.ఈ హరిప్రసాద్, ఆర్అండ్‌బీ ఎస్ఈ జి.కాంతు, ఈఈ బి.రాము, డీఈ జి.రాజేంద్ర, జేఈ మణి కుమార్, సిబ్బంది ఉన్నారు.

రాజమహేంద్రవరం

• రాజమహేంద్రవరం సిటీ/ రూరల్ • రాజానగరం • అనపర్తి

టీఎల్ఎంను నైపుణ్యంతో తయారు చేయాలి



రంగంపేటలో అంగన్వాడీలు తయారు చేసిన క్రాఫ్ట్‌వర్క్‌ను చూపిస్తున్న కోర్సు డైరెక్టర్ పార్థసారథి

రంగంపేట/అనపర్తి, ఫిబ్రవరి 22(ఆంధ్రజ్యోతి): తక్కువ ఖర్చుతో ఎక్కువ ఆకర్షణీయమైన తరగతి గది అలంకరణలు, బోధనోపకరణలు తయారు చేయడంలో నైపుణ్యాభివృద్ధిని పెంచుకోవాలని మండల విద్యాశాఖాధికారి కె.శ్రీనివాసరావు, కోర్సు డైరెక్టర్ వి.పార్థసారథి, అనపర్తి ఎంఈవో నల్లమిల్లి సత్తిరెడ్డి సూచించారు. స్థానిక జడ్పీ ఉన్నత పాఠశాలలోను, అనపర్తిలోని బాలుర ఉన్నత పాఠశాలలోను అంగన్వాడీలకు జ్ఞానజ్యోతి నాలుగో రోజు శిక్షణా కార్యక్రమం శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఈవోలు మాట్లాడుతూ చిన్నారుల భావోద్వేగాలు గుర్తించి మంచి అలవాట్లు పెంచడం అలవర్చుకోవాలన్నారు. స్థానికంగా దొరికే వనరులను ఉపయోగించి చేసే క్రాఫ్టులు, పుట్టినరోజు వేడుకలు, మట్టి, మైదా తదితర పదార్థాలతో వివిధ ఆకృతులను తయారు చేసే క్లేమౌల్డింగ్ ఏ విధంగా తయారు చేయాలో, తల్లిదండ్రులు, సమాజ భాగస్వామ్యంతో కేంద్రాలు ఎలా అభివృద్ధి చేయాలో డీఆర్పీలు కె.రాజు, ఎన్‌వీ రమణాంజలి, విత్రిమూర్తులు, సుభద్ర, దాసరాజు చేయించారు. శ్రీకృష్ణపట్నం రామచంద్ర మిషన్‌కు చెందిన యోగా గురువులు ఇ.రాంబాబు యోగాసనాలపై కార్యకర్తలకు శిక్షణ ఇచ్చారు. కార్యక్రమాల్లో ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు పాల్గొన్నారు.

'పే బ్యాక్ టు సొసైటీ'తో సమాజాభివృద్ధి



సేవతత్పరులను సత్కరిస్తున్న అంబేడ్కర్ ఫ్రెండ్స్ సర్కిల్

రాజమహేంద్రవరం సిటీ, ఫిబ్రవరి 22(ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఆశయమైన పే బ్యాక్ టూ సొసైటీ నినాదంతోనే సమాజ అభివృద్ధి సాధ్యమని డాక్టర్ అంబేడ్కర్ మెమోరియల్ ఫ్రెండ్స్ సర్కిల్ వెల్ఫేర్ అసోసియేషన్ వ్యవస్థాపకుడు దియ్యన రవీంద్రనాథ్ ఠాగూర్ అన్నారు. అసోసియేషన్ ప్రథమ వార్షికోత్సవం స్థానిక హోలీ ట్రినిటీ చర్చ్‌లో శనివారం జరిగింది. ఈ సందర్భంగా వివిధ రంగాల్లో సేవలందించిన 9 మందిని బీఆర్ అంబేడ్కర్ సేవా పురస్కారాలతో సన్మానించారు. ఈ సందర్భంగా ఠాగూర్ మాట్లాడుతూ సమాజంలో అణగారిన వర్గాలకు పే బ్యాక్ టు సొసైటీ నినాదంతో ముందు సాగుతున్నామన్నారు. సమాజంలో సేవతత్పరులుగా ఉన్నా ఎస్ఈ తిలక్‌కుమార్, సానబోయిన రామారావు, డి.మధుమూర్తి, ఎ.ప్రసాద్‌కుమార్, ఎంఎస్ శోభారాణి, తాడేపల్లి శ్రీనివాసరావు, కె.యశ్వంత్ తదితరులను సత్కరించారు.

'పేరాబత్తుల' విజయానికి సహకరించండి

రాజమహేంద్రవరంలో ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారంలో ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు



పట్టభద్రులను ఓట్లు అభ్యర్థిస్తున్న ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు

రాజమహేంద్రవరం సిటీ, ఫిబ్రవరి 22(ఆంధ్రజ్యోతి): పట్టభద్రుల ఎమ్మెల్సీ కూటమి అభ్యర్థిగా పోటీ చేస్తున్న పేరాబత్తుల రాజశేఖరం విజయానికి ఓటర్లు సహకరించాలని ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ పిలుపునిచ్చారు. శనివారం ఆయన స్థానిక 37వ డివిజన్‌లో ఎన్నికల ప్రచారం చేశారు. పట్టభద్రులైన ఓటర్లను కలిసి కరపత్రాలు అందించి మొదటి ప్రాధాన్య ఓటు రాజశేఖరంకు వేసి అఖండ మెజార్టీతో గెలిపించాలని కోరారు. నిరుద్యోగులకు, ఉద్యోగులకు ఇచ్చిన హామీలను కూటమి ప్రభుత్వం నెరవేర్చేందుకు కృషి చేస్తోందన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు కంటిపూడి శ్రీనివాస్, బుడ్డిగ రవి, బొమ్మన జయకుమార్ తంగెళ్ల బాబి, కరగాని వేణు, మళ్ల వెంకట రాజు పాల్గొన్నారు. అలాగే టీడీపీ రాష్ట్ర కార్యదర్శి కాశి నవీన్‌కుమార్ నగరంలోని ఆకాష్, శ్రీచైతన్య, భాష్యం, జన్వర్, ఆదిత్య, కళాశాలు, స్కూళ్లకు వెళ్లి ఉపాధ్యాయులను, అధ్యాపకులను కలిసి పేరాబత్తులకు ఓట్లు వేసి గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో బత్తుల రవికిరణ్, మదీనా సాహెబ్, తదితరులు పాల్గొన్నారు.

రాజమహేంద్రవరం రూరల్: మంత్రి నిమ్మల రామానాయుడు పాలకొల్లు కళాశాలలో నిర్వహించిన ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారంలో టీడీపీ రాష్ట్ర మహిళా ప్రధాన కార్యదర్శి మజ్జి పద్మ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మహిళా సంక్షేమానికి కూటమి ప్రభుత్వం విశేష కృషి చేస్తోందని, నిరుద్యోగ ఉపాధి కల్పనే ధ్యేయంగా సీఎం చంద్రబాబు, డిప్యూటీసీఎం పవన్‌కల్యాణ్‌లు కృషి చేస్తున్నారన్నారు. ఎమ్మెల్సీ కూటమి అభ్యర్థి పేరాబత్తుల రాజశేఖర్ విజయానికి కృషి చేద్దామన్నారు.



మంత్రి రామానాయుడుతో కలిసి ప్రచారంలో పాల్గొన్న మజ్జి పద్మ

జంక్ ఫుడ్స్‌కు దూరంగా ఉండండి

రాజమహేంద్రవరం కల్చరల్, ఫిబ్రవరి 22(ఆంధ్రజ్యోతి): మానవ శరీరానికి హాని కలిగించే జంక్ ఫుడ్స్‌కు ప్రతిఒక్కరూ దూరంగా ఉండాలని జిల్లా వినియోగదారుల రక్షణ మండలి సభ్యుడు గొట్టుముక్కల అనంతరావు పిలుపునిచ్చారు. శనివారం రాజమహేంద్రవరం గణేష్ చౌక్‌లోని రైతు బజార్లో కన్స్యూమర్స్ వాయిస్ ఆధ్వర్యంలో వినియోగదారుల అవగాహన సదస్సు నిర్వహించారు. జిల్లా విజిలెన్స్ కమిటీ సభ్యుడు ధర్నాలకోట వెంకటేశ్వరరావు అధ్యక్షతన జరిగిన ఈ సదస్సుకు అనంతరావు విచ్చేసి మాట్లాడుతూ వినియోగదారుల చట్టంపై ప్రతిఒక్కరికీ అవగాహన ఉండాలని, ఏ విధమైన అవకతవకలు, మోసాలు జరిగినా కన్స్యూమర్ కమిషన్లను, వినియోగదారుల సంఘాలను ఆశ్రయించాలన్నారు. వెంకటేశ్వరరావు మాట్లాడుతూ కొన్న ప్రతి వస్తువుకు కన్స్యూమర్ రశీదు తీసుకోవాలన్నారు. అనంతరం రైతు బజార్‌లోని దుకాణాలను పరిశీలించి పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో రైతు బజార్ ఉద్యోగి విజయ్, పలువురు రైతులు, వినియోగదారులు పాల్గొన్నారు.

ఎల్ఐసీ విశ్రాంత ఉద్యోగుల సర్వసభ్య సమావేశం



సమావేశంలో మాట్లాడుతున్న కెఎస్ఎన్ మూర్తి

రాజమహేంద్రవరం కల్చరల్, ఫిబ్రవరి 22(ఆంధ్రజ్యోతి): స్థానిక మోడల్ కాలనీలోని ఎల్ఐసీ ఎంప్లాయిస్ అసోసియేషన్ బిల్డింగ్‌లో శనివారం ఎల్ఐసీ రిటైర్డ్ ఎంప్లాయిస్ అసోసియేషన్ 23వ వార్షిక సర్వసభ్య సమావేశం జరిగింది. వై.రఘునాథరావు అధ్యక్షతన జరిగిన ఈ సమావేశానికి ఎంప్లాయిస్ జోనల్ అధ్యక్షుడు పి.సతీష్ విచ్చేసి మాట్లాడుతూ ఎల్ఐసీ యాజమాన్యం ఏజెంట్ల కమీషన్ రేట్లను తగ్గించడం సరికాదన్నారు. ప్రస్తుత ప్రభుత్వ విధానాలే ఎల్ఐసీని బలహీనపరుస్తున్నాయని, దేశ సంక్షేమానికి పాటుపడుతున్న ప్రభుత్వ సంస్థను ఇలా బలహీన పరచడాన్ని ఖండించారు. ఈ సందర్భంగా నూతన అధ్యక్షుడిగా వై.రఘునాథరావు, జనరల్ సెక్రటరీగా కేఎస్ మూర్తి, కోశాధికారిగా జీవీ అప్పారావు, ఉపాధ్యక్షుడిగా పి.సుబ్బారావు, మరో నలుగురు సంయుక్త కార్యదర్శులుగా ఎన్నికయ్యారు. సమావేశంలో మచిలీపట్నం పెన్షనర్ల ప్రధాన కార్యదర్శి బీహెచ్‌వీఎల్ రాధాకృష్ణమూర్తి,విశాఖపట్నం డివిజన్ కార్యదర్శి బి.గణేష్‌తోపాటు ఉభయ గోదావరి జిల్లాల నుంచి 140మంది పెన్షనర్లు పాల్గొన్నారు.

వైసీపీది విధ్వంసకర పాలన : ఎమ్మెల్యే బత్తుల



కోరుకొండ, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): గత వైసీపీ ప్రభుత్వానిది విధ్వంసకర పాలన అయితే, ప్రస్తుత కూటమిది సంక్షేమ పాలన అని ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ అన్నారు. శనివారం కోరుకొండ జనసేన పార్టీ కార్యాలయంలో ఏర్పాటుచేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. వైసీపీ హయాంలో రాష్ట్రానికి తీవ్రనష్టం వాటిల్లిందన్నారు. దాన్ని సవాల్‌గా తీసుకుని సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ ముందుకెళ్తున్నారన్నారు. అన్నదాత సుఖీభవ కార్యక్రమాన్ని వచ్చే ఖరీఫ్ సీజన్ ప్రారంభం నుంచి అమలు చేస్తామన్నారు. త్వరలో డీఎస్సీ నోటిఫికేషన్ రానుందని చెప్పారు. నిరుద్యోగులకు ఉద్యోగావకాశాలు కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు. కౌన్సిల్‌లో కూడా ప్రభుత్వ బలం పెరగాలంటే కూటమి బలపరిచిన గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ అభ్యర్థి పేరాబత్తుల రాజశేఖర్‌ను అత్యధిక మెజార్టీతో గెలిపించుకోవాలని ఎమ్మెల్యే అన్నారు.

తప్పిదం జరిగితే ఉపేక్షించం

» పరిశ్రమలను సేఫ్టీ కమిటీ బృందాలు తనిఖీ చేసి రిపోర్టు ఇవ్వాలి

» జిల్లా కలెక్టర్ ప్రశాంతి



రాజమహేంద్రవరం రూరల్ ఫిబ్రవరి 22(ఆంధ్రజ్యోతి): పరిశ్రమల్లో సాంకేతిక అంశాలకు సంబంధించి ఎక్కడా ఎటువంటి తప్పిదం జరిగినా ఉపేక్షించేది లేదని హెచ్చరించారు. జిల్లాలోని రసాయన, ఇతర పరిశ్రమలను సేఫ్టీ కమిటీ బృందాలు తరచూ తనిఖీలు నిర్వహించి నివేదికలు సమర్పించాలని జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి అధికారులను ఆదేశించారు. కలెక్టర్ క్యాంపు కార్యాలయ సమావేశ మందిరంలో జరిగిన జిల్లా పారిశ్రామిక ప్రోత్సాహక కమిటీ సమావేశానికి ఆమె అధ్యక్షతన వహించి మాట్లాడారు. జిల్లాలోని కెమికల్ ఆధారిత, ఇతర పరిశ్రమలను సేఫ్టీ కమిటీ బృందాలు తరచూ తనిఖీ చేసి భద్రతా ప్రమాణాలు, వాటి నుంచి వెలువడే రసాయనాలను, వాయువుల స్థాయి ఎప్పటికపుడు పరిశీలించి నివేదికలు అందజేయాలని ఆదేశించారు. అస్సాగో, ఏపీ పేపరు మిల్స్, ఠాగూర్ ల్యాబ్, ధరణి మెడికల్స్ వంటి పరిశ్రమలతో పాటు అన్ని పరిశ్రమల్లో సాంకేతిక అంశాలపై తనిఖీలు నిర్వహించి నివేదికలు సమర్పించాలన్నారు. సింగిల్ విండో విధానంతో అనుమతులు ఒకేచోట ఇస్తున్నట్టు తెలిపారు. అప్లికేషన్లు పెండింగ్‌లో లేకుండా కార్యాచరణ వేగవంతం చేయాలన్నారు. ఇందుకుగాను టైమ్ లైన్ ఇచ్చామన్నారు. జిల్లాలో పరిశ్రమలకు విద్యుత్ అందించే ప్రక్రియ వేగవంతం చేయాలని ట్రాన్స్‌కో ఎస్ఈని ఆదేశించారు. మల్కాకార్టన్ ఫ్యాబ్రిక్స్ వస్త్రాల తయారీలో సేంద్రీయ రంగుల అద్దకం, కుట్టు ప్రక్రియలో నైపుణ్యత గల వారికి శిక్షణను అందించే విధంగా చర్యలు చేపట్టాలని పరిశ్రమల శాఖ, నైపుణ్యాభివృద్ధి సంస్థ, జౌళి శాఖ అధికారులతో సమన్వయం చేసుకోవాలని సూచించారు. గిరిజన ఉత్పత్తులను స్థానికంగానే కాకుండా దేశ, అంతర్జాతీయ మార్కెట్‌లో విక్రయాలు జరిపేందుకు ఆన్‌లైన్ సౌకర్యం కలిగించేలా తగిన చర్యలు తీసుకోవాలన్నారు. ఎంఎస్ఎంఈ ఇంటింటి సర్వేలో భాగంగా జిల్లాలో 92,980 యూనిట్లకు గాను ఇప్పటి వరకు 42,949 మాత్రమే మంజూరు చేశారని, మిగిలినవి కూడా వేగవంతం చేయాలని కలెక్టర్ ఆదేశించారు. విశ్వకర్మ యోజన కింద లబ్ధిదారుల ఎంపిక సర్వే పూర్తి చేయాలన్నారు. సమావేశంలో జిల్లా పరిశ్రమల అధికారి శ్రీనిధర్, అసిస్టెంట్ డైరెక్టర్ ప్రదీప్, విద్యుత్ శాఖ ఎస్ఈ కె.తిలక్‌కుమార్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

28న విజయవాడలో ఏఐకేఎంఎస్ రాష్ట్ర సదస్సు

జాతీయ అధ్యక్షురాలు టాన్యా



రాజమహేంద్రవరంలో పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న టాన్యా

రాజమహేంద్రవరం సిటీ, ఫిబ్రవరి 22(ఆంధ్రజ్యోతి): భూసమస్యలపై ఈ నెల 28న విజయవాడలో ఏఐకేఎంఎస్ రాష్ట్రస్థాయి సదస్సు నిర్వహిస్తున్నామని ఏఐకేఎంఎస్ జాతీయ అధ్యక్షురాలు పి.టాన్య తెలిపారు. ఈ మేరకు సదస్సు పోస్టర్‌ను శనివారం రాజమహేంద్రవరం మావో భవన్‌లో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా టాన్య మాట్లాడు తూ భూమి ఎవరిసొత్తు కాదన్నారు. ఒక తరం నుంచి మరో తరానికి బదిలీ మాత్రమే కావాలన్నారు. అయితే 75 ఏళ్లు నిండిన వేళ ఈ దేశ పరిస్థితి ఏమిటీ? జాతీయ శాంపిల్స్ సర్వే తెలిపిన అరకొర వివరాల ప్రకారం కూడా దేశ జనాభాలోని 3.2 గ్రామీణ కుటుంబాలు, 42.8 భూమి కలిగి ఉన్నాయని, 9.5శాతం ఉన్నత కుటుం బాలు 56.6శాతం భూమిని ఆధీనంలో ఉంచు కున్నాయని, మిగిలిన కుటుంబాల చేతిలో 90.3 శాతం, గ్రామీణ కుటుంబాలు 43.3శాతం భూ మి మాత్రమే కలిగి ఉన్నాయని, వీరిలో కూడా 41.6శాతం గ్రామీణ కుటుంబాలకు పెరటి చెక్కలు కూడాలు లేవన్నారు. అందుకు సమాజ మనుగడకు, ప్రజా జీవనానికి, మౌలిక అవసరమైన భూమిహక్కులను పరిశీలిస్తే అట్టడుగున ఆదివాసీలు ఉన్నారన్నారు. ఈ నేపథ్యంలో భూ సమస్యలపై చర్చించేందుకు సదస్సును నిర్వహిస్తున్నామని చెప్పారు. సదస్సుకు ఏఐకేఎంఎస్ రాష్ట్రాధ్యక్షుడు టి.ప్రకాష్, నల్లమడ రైతు సంఘం డాక్టర్ కొల్లా రాజ్మోహన్, ఏఐకేఎంఎస్ తెలంగాణ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బి.భాస్కర్, ఏపీ రైతు సంఘాల సమన్వయ సమితీ కన్వీనర్ వడ్డే శోభనాదీశ్వరరావు తదితర ప్రముఖులు హాజరవుతారన్నారు.కార్యక్రమంలో సీపీఐఎంఎల్ న్యూడెమోక్రసీ కార్యదర్శి కిరణ్‌కుమార్, ఐఎఫ్‌టీయూ జిల్లా కార్యదర్శి చీకట్ల వెంకటేశ్వరరావు, మణికంఠ, రమణ, అప్పారావు పాల్గొన్నారు.

తడి, పొడి చెత్త సేకరణ



ధవళేశ్వరంలో చెత్త సేకరణను పర్యవేక్షిస్తున్న అధికారులు

ధవళేశ్వరం, ఫిబ్రవరి 22(ఆంధ్రజ్యోతి): స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా ఇంటింటా తడి, పొడి చెత్తను వేర్వేరుగా సేకరించే స్పెషల్ డ్రైవ్ చేపట్టారు. దీనిలో భాగంగా సేకరించిన తడి, పొడి చెత్తను చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాలకు తరలిస్తున్నారు. శని, ఆది వారాల్లో పంచాయతీ పారిశుద్ధ్య సిబ్బంది 5 టీములుగా ఏర్పాటు చేసి ఇంటింటా చెత్తసేకరణ కార్యక్రమాన్ని పంచాయతీ అధికారి జి.వెంకట్రావు, విస్తరణాధికారి కె.సునీల్ ఆర్మ్‌స్ట్రాంగ్ పర్యవేక్షిస్తున్నారు. కార్యక్రమంలో పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

బిక్కవోలు: మండలంలోని ప్రతి గ్రామంలో శనివారం పంచాయతీ పారిశుద్ధ్య కార్మికులు తడి, పొడి చెత్తలను సేకరించారు. గ్రామంలో ప్రతి ఇంటికి వెళ్లి గతంలో పంపిణీ చేసిన డస్ట్‌బిన్‌ల ద్వారా ఈచెత్తను సేకరించి గ్రామంలోని చెత్త నుంచి సంపద తయారీ కేంద్రానికి తరలించారు. ఈ సందర్భంగా పంచాయతీల విస్తరణాధికారి జాన్ మిల్టన్ మాట్లాడుతూ మండలంలోని 13 గ్రామాల్లోను తడి, పొడి చెత్తలను సేకరించామని, వీటి ద్వారా సంపద సృష్టిస్తామన్నారు. ప్రతి ఒక్కరూ తమ ఇళ్లలోని చెత్తలను వేరు, వేరుగా తమకు అందించి సహకరించాలని కోరారు. ఆదివారం కూడా ఈ కార్యక్రమం నిర్వహిస్తామన్నారు. మండలంలోని పంచాయతీ కార్యదర్శులు అందరు పాల్గొన్నారు.

కడియం: జేగురుపాడులో చెత్తసేకరణపై ఈవోపీఆర్‌డీ రామ్‌ప్రసాద్ అవగాహన కల్పించారు. ఇంటింటికీ వెళ్లి తడిచెత్త, పొడిచెత్తను వేరువేరుగా పారిశుద్ధ్య కార్మికులకు అందచేయాలని సూచించారు. ఇలా వేరువేరుగా చెత్త సేకరణ వలన జరిగే ప్రయోజనాలను వివరించారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శి అయినవిల్లి శ్రీనివాసరావు, జూనియర్ అసిస్టెంట్ సత్తిబాబు, పంచాయతీ, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.



కొంకుదురులో చెత్త సేకరణను పరిశీలిస్తున్న పంచాయతీ సిబ్బంది

యువత నైపుణ్యాలను పెంపొందించుకోవాలి

» ఆర్ట్స్ కళాశాలలో ముగిసిన యువజనోత్సవాలు

» విజేతలకు బహుమతులు ప్రదానం



పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేస్తున్న నన్నయ యూనివర్శిటీ రిజిస్ట్రార్ సుధాకర్

రాజమహేంద్రవరం అర్బన్, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): యువత చదువుతోపాటు నైపుణ్యాలను పెంపొందించుకోవాలని ఆదికవి నన్నయ యూనివర్శిటీ రిజిస్ట్రార్ సుధాకర్ అన్నారు. రాజమహేంద్రవరం ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాలలో మూడు రోజులపాటు జరిగిన యువజనోత్సవాలు శనివారం సాయంత్రంతో ముగిశాయి. చివరి రోజున సాంస్కృతిక ప్రదర్శనలను నిర్వహించారు. క్లాసికల్, జానపద, సాంఘిక, పౌరాణిక అంశాల్లో పోటీలు పెట్టారు. ఈ సందర్భంగా రిజిస్ట్రార్ సుధాకర్ మాట్లాడుతూ విద్యార్థుల్లో అంతర్లీనంగా దాగి ఉన్న నైపుణ్యాలను వెలికితీయడానికి ఇలాంటి యువజనోత్సవాలు ఎంతో ఉపయోగపడతాయని అన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ రామచంద్ర మాట్లాడుతూ విద్యార్థుల్లో సృజనాత్మకతను, ప్రతిభను వెలికితీసే విధంగా యువజనోత్సవాలను నిర్వహిస్తున్నామని అన్నారు. వివిధ పోటీల్లో గెలుపొందిన విజేతలకు రిజిస్ట్రార్ చేతులమీదుగా బహుమతులు, ప్రశంసాపత్రాలు అందజేశారు. కళాశాల ఉపాధ్యక్షులు శ్రీరామమూర్తి, కళాశాల అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.



ఓ విద్యార్థిని కళా ప్రదర్శన

సేవాభావాన్ని అలవర్చుకోవాలి

స్కౌట్ దినోత్సవంలో జిల్లా విద్యాశాఖ అధికారి వాసుదేవరావు



స్కౌట్ గౌడ్ కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న డీఈవో వాసుదేవరావు

కడియం, ఫిబ్రవరి 22(ఆంధ్రజ్యోతి):విద్యార్థులు సమాజం పట్ల అంకితభావం, సేవాభావం పెంపొందించుకోవాలని జిల్లా విద్యాశాఖ అధికారి కె.వాసుదేవరావు తెలిపారు. కడియం ఉన్నత పాఠశాలలో శనివారం హెచ్ఎం టి.సత్యనారాయణ అధ్యక్షతన స్కౌట్ దినోత్సవం జరిగింది. పాఠశాలలో 40 మంది విద్యార్థులతో స్కౌట్ అండ్ గైడ్స్ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా డీఈవో మాట్లాడుతూ అన్నింటా స్కౌట్ గైడ్స్ విద్యార్థులు ఆద ర్శంగా నిలవాలన్నారు. స్కౌట్ గైడ్ విద్యార్థులతో ప్రార్థన, జెండా గీతాలు, ప్రతిజ్ఞ చే యించారు. కార్యక్రమంలో జిల్లా స్కౌట్ కార్యదర్శి రాజ్‌కుమార్, ఎంఈవో మణికుమార్, గైడ్ టీచ ర్ గిరిజ, వై.వీరరాఘవకుమారి, పీడీలు డేవిడ్, వీరబాబు, గొల్లపల్లి సత్యనారాయణ పాల్గొన్నారు.

రాజమహేంద్రవరం సిటీ: స్కౌట్ అండ్ గైడ్స్ వల్ల విద్యార్థుల్లో క్రమశిక్షణ, దేశభక్తి, సేవాభావం అలవడతాయని ఎస్‌కేవీటీ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఎంపీఎమ్ సుబ్రహ్మణ్యం అన్నారు. స్కూల్లో స్కౌట్ దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా స్కౌట్ పితామహులు సర్ రాబర్ట్‌బెడన్ పవల్ చిత్రపటానికి నివాళులర్పించారు. దేశభక్తి, క్రమశిక్షణ, సమాజసేవ కోసమే స్కౌట్ స్థాపించినట్టు వివరించారు. 1907లో రాబర్ట్ బెడన్ పవల్ దక్షిణాఫ్రికాలో జరిగిన బోయర్ యుద్ధాల్లో గాయపడిన వారికి సేవ చేయడానికి స్కౌట్‌ను ప్రారంభించారని తెలిపారు. బెడెన్ ఫిబ్రవరి 22న జన్మించడంతో ఏటా స్కౌట్ దినోత్సవాన్ని ఆరోజు జరుపుతున్నారని చెప్పారు. కార్యక్రమంలో స్కౌట్ ఉపాధ్యాయుడు వరహాగిరి కృష్ణ మోహన్, చంద్రకళ, రాంబాబు, అప్పారావు, పూర్ణిమ, రమణశ్రీ పాల్గొన్నారు.

మన వికాసం మాస బులిటెన్ ఆవిష్కరణ

రాజమహేంద్రవరం కల్చరల్, ఫిబ్రవరి 22(ఆంధ్రజ్యోతి):స్థానిక ఆర్యాపురంలోని జిల్లా కోర్టు ఆవరణలో ప్రధాన న్యాయమూర్తి గంధం సునీత చాంబర్లో, రిటైర్డ్ జుడిషియల్ ఎంప్లాయీస్ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రచురించిన మన వికాసం మాస బులిటెన్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా రిటైర్డ్ సంఘ సభ్యులు గంధం సునీత అభినందించారు. ఈ బులిటెన్‌లో విశ్రాంత ఉద్యోగులకు ఉపయోగపడే వర్తమాన సమాచారంలో పాటు, సాహిత్య సేవా సంబంధిత ఆర్టికల్స్ కూడా ఉంటాయని సంపాదకుడు ఎస్ఆర్ పృథ్వీ అన్నారు. ఇది సభ్యుల మధ్య వారధిగా ఉంటుందని అధ్యక్షుడు కె.సంపత్‌కుమార్ అన్నారు. అనంతరం పృథ్వీ 43వ పుస్తకం యుద్ధం పద్య కావ్యాన్ని సునీత ఆవిష్కరించి, రచయితను అభినందించారు. కార్యక్రమంలో విశ్రాంత ఉద్యోగులు పాల్గొన్నారు.

విద్యార్థులకు పరీక్ష సామగ్రి పంపిణీ

రాజమహేంద్రవరం సిటీ, ఫిబ్రవరి 22(ఆంధ్రజ్యోతి): రాజమహేంద్రవరం లాలాచెరువు నగరపాలక సంస్థ ఉన్నత పాఠశాలలో 154 మంది పదో తరగతి విద్యార్థులకు టీం స్పిరిట్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో రైటింగ్ ప్యాడ్స్ పెన్నులు తదితర పరీక్షా సామగ్రిని పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆ సంస్థ అధ్యక్షుడు దాచేపల్లి పృథ్వీరాజ్ మాట్లాడుతూ పదో తరగతి విద్యార్థులు రాబోయే పబ్లిక్ పరీక్షల్లో మంచి మార్కులు సాధించాలని ఆకాంక్షించారు. ఎవరైతే పేద విద్యార్థులుంటే వారి అవసరమైన సహాయాన్ని అందజేస్తామని, అవసరమైన వారు 95736 91699, 63038 29889 నెంబర్లను సంప్రదించాలని కోరారు.

దుర్గమ్మ ఆలయ వార్షికోత్సవం

బిక్కవోలు, ఫిబ్రవరి 22(ఆంధ్రజ్యోతి): తొస్సిపూడి కాలువరేవు వద్ద కనకదుర్గమ్మ ఆలయ 39వ వార్షికోత్సవం శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించారు. అధిక సంఖ్యలో భక్తులు దర్శించుకుని, మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో భారీ అన్నసమారాధన జరిపారు.

ఈలకొలనులో దివ్యాంగుల యోగక్షేమాలపై సర్వే

రంగంపేట, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఈలకొలను గ్రామంలో దివ్యాంగుల ఆరోగ్య విషయాలు, పింఛన్ వస్తుందా లేదా, సదరన్ సర్టిఫికెట్లు ఉన్నాయా లేదా, ప్రభుత్వం పథకాలు అందుతున్నాయా లేదా అనే వివరాలను అడిగి తెలుసుకున్నామని మండల న్యాయ సేవాధికార సంస్థ సభ్యుడు ముడికి రాంబాబు శనివారం తెలిపారు. అలాగే స్థానిక జడ్పీ ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయుడు అధ్యక్షతన విద్యార్థులతో సమావేశం ఏర్పాటు చేసి బాల్య వివాహాల వల్ల కలిగే నష్టాలు, ఆరోగ్య సమస్యలను వివరించామన్నారు. కార్యక్రమంలో పీఎల్‌వీ నూతలపాటి అప్పలకొండ, పీహెచ్‌సీ వైద్యురాలు బి.వేణుశ్రీలక్ష్మీ, లీగల్ వలంటీర్లు, అంగన్‌వాడీ వర్కర్లు, ఏఎన్ఎంలు తదితరులు పాల్గొన్నారు.

గుర్తుతెలియని వ్యక్తి మృతి



ధవళేశ్వరం, ఫిబ్రవరి 22(ఆంధ్రజ్యోతి): గుర్తు తెలియని వ్యక్తి చికిత్స పొందుతూ మృతి చెందాడు. పోలీసుల వివరాల ప్రకారం.. ధవళేశ్వరం క్వారీ కెనాల్ రోడ్డులో ఈనెల 17న వ్యక్తి అపస్మారక స్థితిలో పడి ఉన్నాడన్న సమాచారంతో పోలీసులు 108 అంబులెన్స్ ద్వారా రాజమహేంద్రవరం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అప్పటి నుంచి చికిత్స పొందుతూ శుక్రవారం అర్ధరాత్రి మృతి చెందాడు. మృతుడి వయస్సు సుమారు 67 ఏళ్లు ఉంటుందని, తెల్లని జుట్టు, గెడ్డంతో ఒంటిపై నల్లని ప్యాంట్ ఎరుపు చొక్కా ధరించి పైన నలుపు, తెలుపు రంగు గల జర్కిన్ ఉన్నాయని పోలీసులు తెలిపారు.

బాలుడిపై కేసు నమోదు

రాజమహేంద్రవరం, ఫిబ్రవరి 22(ఆంధ్రజ్యోతి): ఓ బాలిక ఫిర్యాదుతో బాలుడు (18)పై వన్‌టౌన్ పోలీసులు కేసు నమోదు చేశారు. బాలిక ఫిర్యాదులో పేర్కొన్న వివరాల ప్రకారం.. గోకవరం మండలం కొత్తపల్లికి చెందిన బాలిక దానవాయిపేటలోని ఓ కాలేజీలో చదువుతున్న తనను అప్పటికే రెండో ఏడాది చదువుతున్న స్నేహితురాలి అన్నయ్య బలవంతంగా తీసుకెళ్లి కోరుకొండ లక్ష్మీనరసింహ స్వామి గుడికి తీసుకెళ్లి పెళ్లి చేసుకోకపోతే చచ్చిపోతానంటూ బెదిరించాడని ఆ బాలిక ఫిర్యాదులో తెలిపింది. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని సీఐ మురళీకృష్ణ పేర్కొన్నారు.

ఉరి వేసుకున్న భర్త

రాజమహేంద్రవరం, ఫిబ్రవరి 22(ఆంధ్రజ్యోతి): భర్త మృతిపై బొమ్మూరు పోలీసులు కేసు నమోదు చేశారు. సీఐ కాశీ విశ్వనాథ్ తెలిపిన వివరాల ప్రకారం.. విజయవాడకు చెందిన ఎస్.కృష్ణ మనోజ్(34) స్థానికంగా ఓ ఫైనాన్స్ సంస్థలో పని చేస్తున్నాడు. విజయవాడకు చెందిన శ్రావణితో ఏడేళ్ల క్రితం వివాహం కాగా సంతానం లేదు. భార్యతో కలిసి హుకుంపేట శ్రీవల్లీ కాలనీలోని అపార్టుమెంటు ఫ్లాటులో నివాసం ఉంటున్నాడు. శ్రావణి ఆరోగ్యం బాగో లేకపోవడంతో వారం క్రితం పుట్టింటికి వెళ్లింది. ఈ క్రమంలో మనోజ్ ఇంటి నుంచి దుర్వాసన వస్తోందంటూ శనివారం స్థానికుల సమాచారంతో పోలీసులు చేరుకొని తలుపులు తీసి చూడగా సీలింగ్ ఫ్యానుకు మనోజ్ వేలాడుతున్నాడని.. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని సీఐ చెప్పారు.


విశ్వశాంతి దినోత్సవ ర్యాలీ

రాజమహేంద్రవరం కల్చరల్, ఫిబ్రవరి 22(ఆంధ్రజ్యోతి): స్థానిక ఆదిత్య బిజినెస్ స్కూల్‌లో ఎన్ఎస్ఎస్ విద్యార్థులు శనివారం విశ్వశాంతి దినోత్సవం సందర్భంగా ర్యాలీని నిర్వహించారు. ప్రపంచ శాంతికై- విశ్వ మానవ మనుగడకై అనే నినాదంతో ర్యాలీని ప్రారంభించామని కళాశాల డైరెక్టర్ ఎస్పీ గంగిరెడ్డి అన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డి.రామకృష్ణ, ఎన్ఎస్ఎస్ పీవో జి.నాగేశ్వరరావుఅధ్యాపకులు పాల్గొన్నారు.

సినిమా గైడ్

(రాజమహేంద్రవరం)

శ్యామల	: సంక్రాంతికి వస్తున్నాం
సూర్యమినీ	: రిటర్న్ ఆఫ్ ది డ్రాగన్
సూర్యప్యాలస్	: చావా
స్వామి	: బ్రహ్మఆనందం
శివజ్యోతి	: రామం రాఘవం
అనుశ్రీ(సాయికృష్ణ)	: లైలా
రాజా	: సంక్రాంతికి వస్తున్నాం
ఊర్వశి	: రామం రాఘవం
రంభ	: బాపు
మేనక	: తల
అప్సర	: తండేల్
కుమారి	: రిటర్న్ ఆఫ్ ది డ్రాగన్
అశోక	: జాబిలమ్మ నీకు అంత కోపమా
బీఎస్ మహల్(నామవరం)	: తండేల్
మురళీకృష్ణ(ధవళేశ్వరం)	: తండేల్
వెంకటసూర్య(కడియం)	: ---
సత్యగౌరి (అనపర్తి)	: రామంరాఘవం
సూర్యశ్రీ (అనపర్తి)	: ----
ఫార్చ్యూన్ సినిమాస్(రాజానగరం)	: రిటర్న్ ఆఫ్ ది డ్రాగన్
రామకృష్ణ(కోరుకొండ)	: తండేల్
గీతాసినిమాస్ (సీతానగరం)	: తండేల్
శ్రీనివాస (గోకవరం)	: తండేల్
టీడీ సినీ మ్యాక్స్ (గోకవరం)	: రామంరాఘవం
లలితామహల్(రంపచోడవరం)	: తండేల్
నవయుగ(చింతూరు)	: తండేల్



ఇక్కడ సినిమా తీస్తే..హిట్టే

సినిమాటోగ్రఫీ మంత్రి దుర్గేష్

కొవ్వూరు,ఫిబ్రవరి 22(ఆంధ్రజ్యోతి) : గోదావరి నదీ పరీవాహక ప్రాంతాల్లో షూటింగ్ జరిగే సినిమాలు తప్పక విజయం సాధిస్తాయని..ఈ సినిమా కూడా హిట్ అవుతుందని రాష్ట్ర పర్యాటక సాంస్కృతిక సినిమాటోగ్రఫీ శాఖా మంత్రి కందుల దుర్గేష్ అన్నారు. కొవ్వూరు మండలం కుమారదేవంలో మైత్రి మూవీ మేకర్స్ ప్రొడక్షన్‌లో షూటింగ్ జరుపుకుంటున్న రాపో 22 చిత్ర నిర్మాణాన్ని శనివారం ఆయన సందర్శించారు. హీరో రామ్ పోతినేని, డైరెక్టర్ పి.మహేష్‌బాబులను కలుసుకున్నారు.

ఆర్టీసీ ప్రయాగ్‌ం అదుర్స్!



ఆర్టీసీ ప్రయోగం అదిరింది.. ప్రయాగ్‌రాజ్‌లో కుంభమేళాకు వేలాదిగా భక్తులను తరలించింది.. ఎక్కడా ఎటువంటి లోటు పాట్లు లేకుండా చూసుకుని.. ఆర్టీసీలో ప్రయాణం సురక్షితమే కాదు.. సుఖవంతం కూడా అని నిరూపించింది.. మరో మూడు రోజుల్లో కుంభమేళా ముగియనున్న నేపథ్యంలో ఆర్టీసీపై ప్రత్యేక కథనం 8

చదువుల్లోనే కాదు.. ఆటల్లోనూ ఫస్ట్ అంటున్నారు.. నన్నయ వర్సిటీ వీసీ ప్రసన్న శ్రీ.. నన్నయ వర్సిటీలో నిర్వహించిన క్రికెట్ పోటీలను వీసీ బ్యాటింగ్ చేసి శనివారం ప్రారంభించి మాట్లాడారు. విశ్వవిద్యాలయంలో సిబ్బందికి, విద్యార్థులకు వివిధ పోటీలు నిర్వహిస్తున్నామన్నారు. చక్కటి కార్యక్రమాలు నిర్వహిస్తున్న విశ్వవిద్యాలయం ఉమెన్ సెల్‌ను అభినందించారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ ఆచార్య జి.సుధాకర్, ఉమెన్స్ సెల్ కోఆర్డినేటర్ ఆచార్య ఉమామహేశ్వరీదేవి పాల్గొన్నారు. - దివాన్‌చెరువు



క్రికెట్ ఆడేస్తా!

ఆలయాలకు గ్రేడ్‌లు

- గతేడాది జీవో 268 విడుదల
- 108 టెంపుల్స్, సంస్థలకు గ్రేడ్‌లు
- ఆదాయం ఆధారంగా కేటాయింపు

రాజమహేంద్రవరం, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలోని దేవాదయ ధర్మాదాయ శాఖ ఆధీనంలోని 108 ఆలయాలు, సంస్థల గ్రేడ్‌లను ఆదాయాన్ని అనుసరించి మార్పులు చేస్తూ ఆ శాఖ కమిషనర్ కె.రామచంద్ర మోహన్ ఆదేశాలు జారీ చేశారు. వాస్తవానికి ప్రభుత్వం ఈ అంశానికి సంబంధించి గతేడాది నవంబరు 12న జీవో 268ని విడుదల చేసింది. అయితే కొన్ని 'అంతర్గత వ్యవహారాల' వల్ల దీనిని తొక్కిపెట్టారు. తర్వాత అత్యున్నత అధికారి సీరియస్ కావడంతో వర్గీకరణలో మార్పులు తప్పలేదు. ఈ ఉత్తర్వుల ప్రకారం రాజమహేంద్రవరంలోని ఉమా కోటిలింగేశ్వర, ఉమా మార్కండేయ, శ్యామలాంబ ఆలయాలు 6(బీ)(2)లోకి వెళ్లాయి. జేగురుపాడు జనార్దన స్వామి, ధవళేశ్వరం లక్ష్మీ జనార్దన స్వామి, రాజమహేంద్రవరంలోని కన్నమ్మ పేరంటాలమ్మ, జాంపేట ఉమా రామలింగేశ్వర, వీరభద్రాపురం వల్లీ సుబ్రహ్మణ్యేశ్వర తదితర దేవాలయాలను ఇక నుంచి 6(సీ)(2)గా పరిగణిస్తారు.రాజమహేంద్రవరంలోని గౌతమి గేరక్షణ సంఘం, నేషనల్ సీనియర్ బేసిక్ స్కూల్‌తో పాటు కోరుకొండ, బిక్కవోలు, కొవ్వూరు, మద్దూరు,నిడదవోలు, గోపాలపురం, రంగంపేటలోని సత్రాలను 6(సీ)(1)లోకి చేర్చారు.

గ్రేడ్‌లు ఇలా ఇచ్చారు..

ఆలయాలకు,సంస్థలకు వచ్చే ఆదాయాన్ని బట్టి 6(ఏ), 6(బీ), 6(సీ)గా వర్గీకరణ చేశారు. వార్షికాదాయం రూ.25లక్షలకు పైబడి ఉంటే 6(ఏ), రూ.2 లక్షల నుంచి రూ.25 లక్షల వరకూ 6(బీ), రూ.2 లక్షల్లోపు ఆదాయం సమకూరితే 6(సీ)గా పరిగణించడం జరిగేది. ప్రభుత్వం వాటిని సవరించింది. 6(ఏ) రూ.50లక్షలపైన, 6(బీ) రూ.15 లక్షల నుంచి రూ.50 లక్షలు, 6(సీ)గా రూ.15 లక్షల వరకూ ఆదాయం ఉన్న వాటిని మార్పు చేయాలని నిర్ణయిస్తూ జీవో 268ని జారీ చేసింది.



రాజానగరంలో పరిశీలిస్తున్న డీపీవో

స్వచ్ఛ సర్వేక్షణ్ ప్రారంభం

రాజానగరం, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): జిల్లా వ్యాప్తంగా 300 గ్రామ పంచాయతీల్లో రెండు రోజులు ఇంటింటా చెత్తసేకరణ ప్రత్యేక డ్రైవ్ నిర్వహిస్తున్నట్టు డీపీవో వి.శాంతమణి తెలిపారు. రాజానగరంలో శనివారం చెత్త సేకరణ ప్రత్యేక డ్రైవ్‌లో డీఎల్‌పీవో ఎం.నాగలతతో కలిసి పాల్గొన్నారు.స్వచ్ఛ సర్వేక్షణ్ కార్యక్రమంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలన్నారు.శనివారం ప్రారంభమైన స్వచ్ఛసర్వేక్షణ్ ఆదివారం కొనసాగుతుందన్నారు.కార్యక్రమంలో ఈవో పీ ఆర్‌డీ లక్ష్మి,కార్యదర్శి ప్రసాద్ పాల్గొన్నారు.

జవాబుదారీతనంతో రెవెన్యూ సేవలందించాలి

సమీక్షలో కలెక్టర్ ప్రశాంతి

రాజమహేంద్రవరం సిటీ, ఫిబ్రవరి 22(ఆంధ్రజ్యోతి): రెవెన్యూ సేవలు జవాబుదారీతనంతో అందించాలని కలెక్టర్ పి ప్రశాంతి ఆదేశించారు. రాజమహేంద్రవరం కలెక్టరేట్‌లో శనివారం జిల్లా రెవెన్యూ అధికారులతో సమీక్షించారు. రీసర్వేలో మ్యుటేషన్, కొరిలేషన్ గ్రౌండ్ టూథింగ్ పనులు పూర్తి చేసే విషయంలో పారదర్శకంగా వ్యవహరించాలని ఆదేశించారు. రెవెన్యూకి ఐదు కేటగిరీలకి చెందిన అర్జీలు ఎక్కువ వస్తున్నాయన్నారు. అర్జీ దారుని సమస్య వినడం వల్ల సమస్యకు పరిష్కారం లభిస్తుందన్న నమ్మకం కలుగుతుందన్న విషయాన్ని గుర్తు చేశారు. ఈ సమావేశంలో డీఆర్‌వో టి.సీతారామమూర్తి,ఆర్‌డీవోలు కృష్ణ నాయక్, రాణి సుస్మిత, ఏవో ఆలీ, తహసిల్దార్లు, కలెక్టరేట్ సిబ్బంది పాల్గొన్నారు.

ఫైర్ స్టేషన్లు.. వస్తున్నాయ్!



జిల్లాకు రెండు మోడల్ ఫైర్‌స్టేషన్లు

- ఫలించిన ఎదురుచూపులు
- ఒక్కో స్టేషన్‌కు రూ.2.85 కోట్లు
- దేవరపల్లిలో ఒకటి.. బొమ్మూరులో మరొకటి నిర్మాణం
- నాడు పట్టించుకోని వైసీపీ
- కూటమి ప్రభుత్వంలో కదలిక
- ఎమ్మెల్యేలు చొరవ చూపాలి

(రాజమహేంద్రవరం-ఆంధ్రజ్యోతి)

ఎన్నాళ్ల నిరీక్షణో.. ఎప్పటి కలో.. త్వరలో తీరనుంది. జిల్లాకు మరో రెండు ఫైర్ స్టేషన్లు అందుబాటులోకి రానున్నాయి. దేవరపల్లి, బొమ్మూరులో మోడల్ స్టేషన్ల తరహాలో వాటిని నిర్మించనున్నారు.ముఖ్యంగా దేవరపల్లి, గోపాలపురం పరిసర ప్రాంతాల ప్రజలకు ఇది తీపి కబురని చెప్పవచ్చు. గత టీడీపీ ప్రభుత్వంలో పనుల వరకూ వచ్చినా తర్వాత ప్రభుత్వం మారడంతో ఫలితం లేకుండా పోయింది. శంకుస్థాపనతోనే గత వైసీపీ ఎమ్మెల్యే సరిపెట్టారు. తర్వాత కూటమికి ప్రజలు అధికారం కట్టబెట్టడంతో కొత్త ఫైర్‌స్టేషన్ల ఫైళ్లకు మోక్షం కలుగుతోంది.

దేవరపల్లిలో..

దేవరపల్లిలో కొత్తగా ఫైర్ స్టేషన్ నిర్మాణానికి సన్నాహాలు జరుగుతున్నాయి. 2019కి ముందే గోపాలపురంలో ఫైర్ స్టేషన్‌ని అప్పటి టీడీపీ ప్రభుత్వం మంజూరు చేసింది.ఆ తర్వాత ప్రభుత్వం మారడంతో వైసీపీ ప్రభుత్వ హయాంలో దేవరపల్లి శివారు రామన్నపాలెం సమీపంలో ఫైర్ స్టేషను నిర్మాణానికి అప్పటి ఎమ్మెల్యే శంకుస్థాపన చేసి వదిలేశారు. ఈసారి కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో ఫైర్‌స్టేషనుకు మళ్లీ కదలిక వచ్చింది. దేవరపల్లి, గోపాలపురం పరిసర ప్రాంతాల్లో పొగాకు బ్యారన్లు అధిక సంఖ్యలో ఉన్నాయి. దీంతో ఇక్కడ నిత్యం అగ్ని ప్రమాదాలు జరుగుతూనే ఉంటాయి. ఫైర్ స్టేషను లేకపోవడంతో ఈ ప్రాంతంలో ఏదైనా అగ్ని ప్రమాదం జరిగితే 25 కిలో మీటర్ల దూరంలో ఉన్న నిడదవోలు లేదా 30 కిలోమీటర్ల దూరంలో ఉన్న కొవ్వూరు లేదా జంగారెడ్డిగూడెం నుంచి 26 కిలోమీటర్లు ప్రయాణించి ఫైర్ ఇంజను రావాల్సి వచ్చేది. ఈలోపు జరగాల్సిన నష్టం జరిగిపోయేది. ఇప్పుడు దేవరపల్లిలో ఫైర్ స్టేషను వస్తుండడంతో స్థానికుల్లో ఆనందం వ్యక్తమవుతోంది. దేవరపల్లి శివార్లలో కంటే దేవరపల్లి- గోపాలపురం మధ్య గొల్లగూడెం సమీపంలో నిర్మిస్తే అనువుగా ఉంటుందని స్థానికులు చెబుతున్నారు. దేవరపల్లిలో నిర్మిస్తే గోపాలపురం 8 కిలోమీటర్లు ప్రయాణించాలి. అదే గొల్లగూడెం సమీపంలో అయితే అటూ ఇటూ 4 కిలోమీటర్లలో చేరవచ్చు. ఇక్కడ రెవెన్యూకు ఎకరం భూమి కూడా ఉంది.

మోడల్‌గా నిర్మాణం

జిల్లాలో ప్రస్తుతం నిడదవోలు, కొవ్వూరు, రాజమండ్రి (ఆర్యాపురం), అనపర్తి, కోరుకొండలో అగ్నిమాపక, విపత్తు ప్రతిస్పందన (ఫైర్ స్టేషను) స్టేషన్లు ఉన్నాయి.ఇప్పుడు రాబోతున్న రెండు ఫైర్‌స్టేషన్లు ప్రస్తుతం ఉన్న వాటి మాదిరిగా కాకుండా మోడల్‌గా నిర్మిస్తారు. ఒక్కో స్టేషనుకు రూ.2.85 కోట్లను ప్రభుత్వం వెచ్చించనుంది. సిబ్బందికి రెస్ట్ రూమ్‌లు, ర్యాంపులు, ఆకర్షణీయమైన ఎలివేషన్, స్టోర్ రూమ్స్ వంటివి ఉంటాయి. ఒక్కో స్టేషనులో ఫైరింజనుతో పాటు 16 మంది సిబ్బంది,ఫైర్ ఆఫీసర్ ఉంటారు.ఈ పోస్టులను ప్రభుత్వం మంజూరు చేయాలి.ఈ రెండు ఫైర్‌స్టేషన్లు అందుబాటులోకి వస్తే జిల్లాలో నియోజకవర్గానికొకటి చొప్పున ఉంటాయి. మొత్తం జిల్లాలో 7 ఫైర్‌స్టేషన్లు ఉంటాయి.

బొమ్మూరులో..

గత వైసీపీ ప్రభుత్వంలో ఫైర్ స్టేషను నిర్మాణానికి ఎక్కడో వెలుగుబందకు అవతల దూరంగా స్థలం కేటాయించారు. ఇక్కడకు ఫైరింజన్ రాకపోకలు సాగించాలంటే సాధ్య పడదు. అందువల్ల ఆ ప్రక్రియ ముందుకు సాగలేదు. ఇప్పుడు రూరల్ ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్యచౌదరి చొరవతో బొమ్మూరు రోడ్డుకు ఓ కిలోమీటరు దూరంలోని సుబ్బాయమ్మ లే-అవుట్‌లో స్థలం కేటాయింపునకు ప్రయత్నాలు జరుగుతున్నాయి. ఫైర్ స్టేషను నిర్మాణానికి అవసరమైన 30 సెంట్ల భూమిని ఎంత త్వరగా ఫైర్ శాఖకు కేటాయిస్తే అంత మేలు జరుగుతుంది. ఏదేమైనా ఎమ్మెల్యేలు మరింత చొరవ చూపితే ఈ ఎండాకాలానికి రెండు ఫైర్ స్టేషన్లు సేవకు సిద్ధం అవుతాయి.

అనుమతులు లేకుండా గ్రావెల్ తవ్వితే శిక్షార్హులు

జిల్లా కలెక్టర్ ప్రశాంతి

రాజమహేంద్రవరం,ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో మైనింగ్ పాలసీని అందరూ పాటించవలసిందేనని కలెక్టర్ పి.ప్రశాంతి హెచ్చరించారు. జిల్లాలో కొవ్వూరు తదితర ప్రాంతాల్లో అక్రమంగా గ్రావెల్ మట్టి తవ్వకాలు జరుగుతున్న విషయంలో 'ఆంధ్రజ్యోతి' వెలుగులోకి తెచ్చిన కథనంపై స్పందించారు. ఏపీ చిన్న తరహా ఖనిజ నియమావళి 1966 ప్రకారం గనులు భూగర్భశాఖ అనుమతి లేకుండా క్వారీ నిర్వహించకూడదన్నారు.అనుమతి లేకుండా ఖనిజం రవాణా చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. అక్రమ మైనింగ్ చేస్తే శిక్షార్హులు అవుతారన్నారు అనుమతి లేకుండా జిరాయితీ,పట్టా భూముల్లో ఖనిజ తవ్వకాలు చేస్తే భూయజమానిపై చర్యలు తీసుకుంటామన్నారు. జిల్లాలో ఎవరూ అనుమతి లేకుండా మట్టి తవ్వకూడదని, తరలించకూడదని ఆమె స్పష్టం చేశారు.



దేచర్లలో తనిఖీలు చేస్తున్న మైన్స్ అధికారులు

మైన్స్ అధికారుల తనిఖీ

కొవ్వూరు, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి) : కొవ్వూరు మండలం దేచర్ల గ్రామంలో ఎర్రమట్టి మట్టి తవ్వుతున్న ప్రాంతాలను శనివారం మైన్స్ ఏడీ డి.ఫణిభూషణ్‌రెడ్డి పరిశీలించారు. 'అనకొండలు' శీర్షికన శనివారం ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన కథనంపై అధికారులు స్పందించారు. సర్వేయర్‌తో భూములను కొలిపించారు. నివేదికలు తయారుచేసి ఉన్నతాధికారులకు అందజేస్తామన్నారు.ఎర్రమట్టి తవ్వకాలు చేపట్టిన భూములకు సంబంధించిన రైతులకు నోటీసులు అందజేస్తామన్నారు.మైన్స్ టెక్నికల్ అసిస్టెంట్ శైలజ, సర్వేయర్ శ్రీనివాస్,వీర్వోలు పాల్గొన్నారు.

చూసీ.. చూడనట్టు!

ఎవరైనా పట్టించుకుంటే ఒట్టు!

వెళ్లాలన్నా కష్టమే : జిల్లాల విభజన అనంతరం వైటీసీ భవనంలో ఏర్పాటు చేసిన 10 జిల్లా కార్యాలయాలు



- సమస్యల మధ్యే..ఆఫీస్‌లు
- 10 జిల్లా కార్యాలయాలు ఉన్నా.. సౌకర్యాలు సున్నా
- వెళ్లడానికి దారుండదు..
- తాగడానికి నీరుండదు
- మరుగుదొడ్లకూ ఇబ్బందే
- రాత్రయితే అంధకారమే
- నాడు హడావుడిగా ఏర్పాటు
- నేటికీ పట్టని అధికారులు
- ప్రజానీకానికి ఇబ్బందులు

రాజమహేంద్రవరం రూరల్, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో ఎక్కడ ఏ సమస్య ఉన్నా అక్కడికే రావాలి.. జిల్లా అధికారులకు చెప్పాలి..సమస్యను పరిష్కరించుకోవాలి.. అయితే అక్కడే సమస్య ఉంటే ఎక్కడికి వెళ్లాలి. ప్రస్తుతం మన జిల్లా కార్యాలయాలదీ ఇదే పరిస్థితి. జిల్లా కార్యాలయాలంటే ఆకర్షణీయంగా ఉండాలి.. అయితే రాజమహేంద్రవరం రూరల్ కేంద్రంగా ఉన్న జిల్లా కార్యాలయాలు పరిశీలిస్తే మాత్రం అక్కడ అన్నీ సమస్యలే. జిల్లా పునర్విభజన నేపథ్యంలో కొన్ని ప్రధాన కార్యాలయాలు న్యాక్ భవనంలోని కలెక్టరేట్ కార్యాలయ సమీపంలో గల యూత్ ట్రైనింగ్ సెంటర్ (వైటీసీ) లో కేటాయించారు.జిల్లా వ్యాప్తంగా ఉన్న 300 పంచాయతీల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరించే జిల్లా పంచాయతీ అధి కారి కార్యాలయం, కోట్లాది రూపాయల కేంద్ర ప్రభుత్వ నిధులు వెచ్చించి పలు అభివృద్ధి పనులు చేపట్టే డ్వామా పీడీ కార్యాలయం, పరిశ్రమల శాఖ, అగ్నిమాపక, స్పోర్ట్స్ నైపుణ్యా భివృద్ధి సంస్థ,సమాచార పౌర సంబంధాల కార్యాలయాలు ఉన్నాయి.ఇటీవల అక్కడే డీఆర్ డీఏ కార్యాలయం ప్రారంభించారు.సుమారు 10 జిల్లా కార్యాలయాలు ఉన్నా సౌకర్యాలు కరువే.



అధ్వానంగా మరుగుదొడ్లు



బాత్‌రూమ్‌లో కుక్క

గత వైసీపీలో హడావుడిగా..

గత వైసీపీ ప్రభుత్వంలో హడావుడిగా జిల్లాల విభజన చేశారు.అంతే హడావుడిగా కార్యాలయాల కేటాయింపులు చేసేశారు. అయితే ఆ కార్యాలయాలకు వెళితే కనీస వసతులు కరువే.మరో పక్క ఆ కార్యాలయాలకు వెళ్లాలన్నా గగనమే. సొంత వాహనం ఉంటేనే కానీ వెళ్లలేని పరిస్థితి. అంతే కాకుండా నగరంలోనే ఉన్నా భయంకరంగా ఎక్కడో అడవుల మధ్య ఉన్నట్టే ఉంటుంది ఆ ప్రాంతమంతా.కాస్త చీకటి పడిన తరువాత కార్యాలయంలో ఉంటే పాములు రావడం ఖాయమే.అటువంటి చోట 10 జిల్లా కార్యాలయాలు ఉన్నాయి.ఆ కార్యాలయాలకు వచ్చే మహిళా సిబ్బంది సమస్యలు చెప్పనలవికావు. కార్యాలయాల వద్ద మరుగుదొడ్లు, మంచి నీటి సౌకర్యం లేక అటు ఉద్యోగులతో పాటు, సమస్యల పరిష్కారం కోసం వచ్చే ప్రజానీకం నానా అవస్థలు పడుతున్నారు. కొన్ని శాఖల సిబ్బంది తలో కొంత వేసుకుని వాటర్ ప్యూరి ఫైర్ బాగు చేయించుకున్నామని చెబుతున్నారు. వెహికిల్స్ పార్కింగ్ లేక అధికారులు సిబ్బంది కార్యాలయం ముందే పార్కింగ్ చేస్తున్నారు. కార్యాలయాలకు పలు సమస్యల నిమిత్తం వచ్చే అర్జీదారులు వేచి ఉండేందుకు వీలులేని పరిస్థితి.



డ్వామా కార్యాలయంలో ఊడిపోయిన ప్లాస్టర్ ఆఫ్ పారిస్

జిల్లా అధికారుల నిర్లక్ష్యం

గత ప్రభుత్వ పాలకుల నిర్లక్ష్య ఒక కారణమైతే..కొంతమంది జిల్లా అధికారుల నిర్వాకంతో కొన్ని కార్యాలయాల ఆధునీకరణకు మంజూరైన నిధులను పక్కదోవ పట్టించినట్టు సమాచారం.దీనికి ఉదాహరణ డ్వామా కార్యాలయంలో కూలిపోయిన సీలింగ్‌సుమారు రూ.5 లక్షలతో కార్యాలయంతో పాటు పీడీ గది ఆధునీకరించారు.దీంతో పాటు లాప్‌టాప్ కొన్ని ఉపకరణాలు కొనుగోలు చేశారు.ఇక్కడో ట్విస్ట్ ఏమిటంటే సర్కారు సొమ్ముతో లాప్‌టాప్ కొన్నా నేటికీ తిరిగివ్వకపోవడం.ఇక చేపట్టిన పనుల్లోనూ నాణ్యత లేదు. డీపీవో కార్యాలయం అయితే మరింత దారుణంగా ఉంది. చీకటి పడితే అంధకారమే. మరుగుదొడ్లు కుక్కలకు ఆవాసాలుగా తయారయ్యాయి. మెట్ల కింద ఉన్న విద్యుత్ బోర్డులు ప్రమాదకరంగా ఉన్నాయి.అదే ప్రాంతంలో సిబ్బంది తమ మోటారు సైకిళ్ల పార్కింగ్ చేస్తున్నారు.పొరపాటున షార్ట్ సర్క్యూట్ అయితే పరిస్థితి అంతే. ఈ ఆవరణలో 10 శాఖలకు పైగా ఉన్నాయి.



ప్రమాదకరంగా ఉన్న విద్యుత్ వైర్లు

చట్టాన్ని విభేదించిన పిల్లల్లో మార్పు తేవాలి : పీడీజే

రాజమహేంద్రవరం, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి) : చట్టాన్ని విభేదించిన పిల్లలను గుర్తించి వారిలో మార్పు తీసుకొచ్చే దిశగా అడుగులు వేయాలని ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ప్రధాన న్యాయమూర్తి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చైర్‌పర్సన్ గంధం సునీత సూచించారు. లీగల్ డిఫెన్స్ కౌన్సిల్ న్యాయవాదులు, స్త్రీ శిశు సంక్షేమ శాఖ, పోలీసు శాఖ, స్పెషల్ జువైనల్ పోలీస్ యూనిట్ల సిబ్బందికి శనివారం నిర్వహించిన శిక్షణ కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. ఆదరణ కొరవడి, వివక్షకు గురవుతున్న చిన్నారులు నేర ప్రవృత్తి బారిన పడుతున్నారన్నారు. అలాంటి వాళ్లను గుర్తించి సన్మార్గంలో నడిపించాలని చెప్పారు.. బాలికల పాఠశాలలు, సాంఘిక సంక్షేమ వసతి గృహాలు, కళాశాలల్లో పిల్లలపై జరిగే దాడుల నివారణకు ఆయా ప్రాంతాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసి డాక్యుమెంటరీ ఎవిడెన్స్ వచ్చేలా చూసుకోవాలని అడిషనల్ ఎస్పీ (అడ్మిన్) ఎన్‌బీఎం మురళీకృష్ణ పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ మేజిస్ట్రేట్ మూడో ఏసీఎఫ్‌సీఎం,డీఎల్ఎస్ఏ కార్యదర్శి ఎన్.శ్రీలక్ష్మి,కోనసీమ అడిషనల్ ఎస్పీ ఏవీఆర్‌పీబీ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

వీళ్లు మారరు..?

ప్రభుత్వ బోధనాసుపత్రి ఎదుట వైద్యానికి మహిళ పడిగాపులు

రాజమహేంద్రవరం అర్బన్, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి) : అత్యవసర వైద్యసేవల విషయంలో రాజమహేంద్రవరం ప్రభుత్వ బోధనాసుపత్రి వైద్యులు, వైద్య సిబ్బంది తీరు మారడంలేదు. రాజమహేంద్రవరానికి చెందిన ఒక మహిళను తీవ్ర అనారోగ్యం కారణంగా శనివారం రాత్రి ఒక ప్రైవేట్ ఆసుపత్రి నుంచి వెంటిలేటర్‌పై బోధనాసుపత్రికి తీసుకొచ్చారు.ఆమెను చేర్చుకోవడానికి ఆసుపత్రిలోని డ్యూటీ వైద్యులు నిరాకరించారు. కేసు సీరియస్‌గా ఉందని, కాకినాడ తీసుకెళ్లిపోవాలంటూ చెప్పేశారు. ఈ సమాచారం తెలుసుకున్న టీడీపీ నాయకుడు కాశి నవీన్‌కుమార్ ఆసుపత్రికి చేరుకుని వైద్యాధికారులతో మాట్లాడారు. పేదలు అత్యవసర వైద్యం కోసం వస్తే నిరాకరించడం సరికాదని, వైద్యసేవలు అందించాలని సూచించారు. దీంతో దిగొచ్చిన ఆసుపత్రి అధికారులు ఆమెను ఐసీయూకు తరలించి వైద్యం అందించారు. దీనిపై సూపరింటెండెంట్ డాక్టర్ లక్ష్మీసూర్యప్రభ మాట్లాడుతూ అత్యవసర కేసుల విషయంలో అప్రమత్తంగా సిబ్బందికి ఆదేశాలు జారీ చేస్తామన్నారు.

ఆక్రమిత స్థలాల క్రమబద్ధీకరణ

- మార్గదర్శకాలు విడుదల
- దరఖాస్తుల ఆహ్వానం
- 2019కి ముందే వర్తింపు
- 150 చ.గ వరకూ ఉచితం

రాజమహేంద్రవరం అర్బన్, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి) : పేదలు నివాస యోగ్యమైన స్థలాల ఆక్రమణలకు సంబంధించి అభ్యంతరాల్లేని ఆక్రమణలను క్రమబద్ధీకరించుకోవడానికి ప్రభుత్వం మార్గదర్శకాలు విడుదల చేసిందని ఆర్డీవో ఆర్.కృష్ణనాయక్ అన్నారు. ఈ మేరకు శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు.ఆక్రమణలను క్రమబద్ధీకరించుకోవడానికి గ్రామ/వార్డు సచివాలయాల్లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. 2019 అక్టోబరు 10వ తేదీకి ముందు ఈ చట్టం వర్తిస్తుందన్నారు. ఆర్‌సీసీ రూఫ్‌తో కానీ యాజ్ బెస్టాస్ రేకులతో కూడిన ఇటుకల ఇళ్ల నిర్మాణం కలిగి ఉండాలని, నిర్దేశిత తేదీకి ముందు కరెంట్ బిల్లు, ఇంటి పన్ను, నీటి పన్ను కలిగి ఉండాలన్నారు. 150 చదరపు గజాల వరకూ ఉచితంగా, ఆపై బేసిక్ విలువ ప్రకారం ప్రభుత్వం నిర్దేశించిన రిజిస్ట్రేషన్ రుసుం చెల్లించాలన్నారు. ప్రభుత్వం జారీ చేసిన జీవోకు లోబడి అంశాలు పరిగణనలోకి వస్తాయన్నారు.

ఖైదీల్లో మానసిక పరివర్తనకు కృషి : వీసీ

రాజమహేంద్రవరం, ఫిబ్రవరి 22(ఆంధ్రజ్యోతి): ప్రొఫెసర్లు, సైకాలజీ విద్యార్థులను పంపించి కౌన్సెలింగ్ చేయడం ద్వారా విద్య, మానసిక ఆరోగ్యం వంటి అంశాల్లో ఖైదీలను సంస్కరించడానికి కృషిచేస్తామని ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం ఉపకులపతి ప్రొఫెసర్ ఎస్.ప్రసన్నశ్రీ స్పష్టం చేశారు. శనివారం ఆమె కేంద్ర కారాగారాన్ని సందర్శించారు. కార్యక్రమంలో డీఎస్ బీ.రత్నరాజు, తదితరులు పాల్గొన్నారు.

రేపటి నుంచి గోలింగేశ్వరస్వామి కల్యాణోత్సవాలు


నిడదవోలు పట్టణంలో వేంచేసి వున్న గోలింగేశ్వరస్వామి

నిడదవోలు, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): నిడదవోలు పట్టణంలో వేంచేసివున్న రాజరాజేశ్వరి సహిత గోలింగేశ్వరస్వామి పంచాహ్నిక దివ్య కల్యాణ మహోత్సవాలు ఈ నెల 24వ తేదీ నుంచి 28 వరకు ఘనంగా నిర్వహిస్తున్నట్టు ఆలయ వంశ పారంపర్య అర్చకులు శ్రీకాకుళపు వెంకటేశ్వరరావు, ఆలయ మేనేజర్ నామా సూర్యప్రకాశరావు తెలిపారు. 24వ తేదీ ధ్వజారోహణ, స్వామి వారికి రుద్రాభిషేకాలు, అమ్మవారికి కుంకుమ పూజలు, అనంతరం రాత్రికి స్వామివారి దివ్యకల్యాణం నిర్వహించనున్నారు. మంగళవారం రుద్రాభిషేకాలు విశేష పూజలు, బుధవారం మహాశివరాత్రి తెల్లవారుజాము మూడు గంటల నుంచే మహాదర్శనం, గురువారం అభిషేకాలు కుంకుమ పూజలు, శుక్రవారం అభిషేకాలు త్రిశూలస్నానం, పూర్ణాహుతి రాత్రికి పుష్పయాగోత్సవం, ఊయలసేవ ఉంటాయన్నారు. భక్తులు ఈ మహోత్సవాల్లో పాల్గొని స్వామి, అమ్మవార్లను దర్శించుకోవాలని ఆలయ వంశపారంపర్య అర్చకుడు శ్రీకాకుళపు వెంకటేశ్వరరావు, ఆలయ మేనేజర్ నామా సూర్యప్రకాశరావు కోరారు.

గ్రూపు - 2 అభ్యర్థులు ఆందోళన చెందొద్దు : ఎమ్మెల్యే


సమావేశంలో మాట్లాడుతున్న ముప్పిడి

కొవ్వూరు, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): గ్రూపు- 2 పరీక్షలు రాస్తున్న నిరుద్యోగ యువతీ, యువకులు ఆందోళన చెందవద్దని ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు అన్నారు. ఈ మేరకు శనివారం ఆయన మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వం రోస్టర్ ఇంప్లిమెంటేషన్ సిస్టమేటిక్ లేకుండా గ్రూపు 2 రాస్తున్న యువతీ, యువకులకు ఇబ్బంది కలిగించే విధంగా నోటిఫికేషన్ ఇవ్వడం జరిగిందన్నారు. దీనిపై కొంతమంది కోర్టును ఆశ్రయించారన్నారు. దీనిపై కోర్టు స్పందించి రాష్ట్రప్రభుత్వంతో మాట్లాడి సరిచేసుకుని ముందుకు వెళ్లాలని సూచించడం జరిగిందన్నారు. దీంతో రాష్ట్ర వ్యాప్తంగా రోస్టర్ ఇంప్లిమెంటేషన్ జరిగే వరకు పరీక్షలు వాయిదా వేయాలని ఆందోళన చేపడుతున్నారు. దీనిపై సీఎం చంద్రబాబు, విద్యాశాఖ మంత్రి లోకేష్ స్పందించి ఏపీపీఎస్సీ కమిటీకి లేఖ పంపించడం జరిగిందన్నారు. గత ప్రభుత్వం ఇచ్చిన నోటిఫికేషన్‌లో రోస్టర్ ఇంప్లిమెంటేషన్‌లో ఇబ్బందులను సరిచేసి పరీక్షలు నిర్వహించాలని స్పష్టంగా తెలిపారు. దీనిపై నిరుద్యోగ యువతీ, యువకులు ఆందోళన చెందవద్దన్నారు.

శివరాత్రికి కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేయాలి : ఆర్డీవో


ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఆర్డీవో రాణిసుస్మిత

కొవ్వూరు, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): మహా శివరాత్రికి కొవ్వూరు గోష్పాదక్షేత్రానికి వచ్చే భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలుగకుండా కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేయాలని కొవ్వూరు ఆర్డీవో డా. రాణిసుస్మిత అన్నారు. శనివారం కొవ్వూరు గోష్పాదక్షేత్రంలో కొవ్వూరు డీఎస్పీ జీ. దేవకుమార్ వివిధశాఖల అధికారులతో కలిసి పర్యటించారు. క్షేత్రానికి వచ్చే భక్తుల సౌకర్యార్థం చేపట్టవలసిన ఏర్పాట్లను పరిశీలించి, అధికారులకు సూచనలు, సలహాలు ఇచ్చారు. ఈ సందర్భంగా ఆర్డీవో మాట్లాడుతూ శివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని గోదావరి పుణ్యస్నానాలకు వచ్చే భక్తులు సౌకర్యార్థం పారిశుధ్యం, లైటింగ్, తాగునీరు, తాత్కాలిక మరుగుదొడ్లు ఏర్పాటుచేయాలని మున్సిపల్ కమిషనర్ టి. నాగేంద్రకుమార్‌ను ఆదేశించారు. పార్కింగ్, ట్రాఫిక్ మళ్లింపు, బందోబస్తుపై పోలీసు అధికారులను సూచించారు. జనాలు నదిలో దిగకుండా బారికేడ్లు ఏర్పాటు చేయాలని ఏజీఆర్‌బీ ఏఈ జీ. మణికంఠరాజును ఆదేశించారు. అనంతరం డీఎస్పీ దేవకుమార్, దేవాదాయశాఖ సీఎఫ్‌వో వీ. శ్రీకృష్ణదేవి తెలిపారు. కొవ్వూరు పట్టణ, రూరల్ సీఐలు పీ. విశ్వం, కే. విజయబాబు, మున్సిపల్ కమిషనర్ టీ. నాగేంద్రకుమార్, మేనేజర్ పీ.సాయిబాబు, తహశీల్దార్ ఎం. దుర్గాప్రసాద్, ఏజీఆర్‌బీ ఏఈ జీ. మణికంఠరాజు, విద్యుత్‌శాఖ ఏఈలు జీ. జగదీశ్వరరావు, సీహెచ్ శ్రీనివాసరావు, మత్స్యశాఖ ఏడీ ఎస్‌కే దిల్షాద్, ఏఈ పీ. కృష్ణవేణి, దేవాదాయశాఖ సీఎఫ్‌వో వీ. శ్రీకృష్ణదేవి, అర్చకులు మానేపల్లి శ్రీనివాసరావు, సుందర గణేష్ పాల్గొన్నారు.

పేరాబత్తుల రాజశేఖరాన్ని గెలిపించాలి

• ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారంలో ఎమ్మెల్యేలు, కూటమి నేతల అభ్యర్థన


వంగిడిలో ఓట్లను అభ్యర్థిస్తున్న ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు


దేవరపల్లిలో ఎన్నికల ప్రచారంలో ఎమ్మెల్యే మద్దిపాటి

కొవ్వూరు, ఫిబ్రవరి 22(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి ఉభయ గోదావరి జిల్లాల గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికలలో పట్టభద్రులంతా కూటమి ప్రభుత్వం బలపర్చిన పేరాబత్తుల రాజశేఖరానికి మొదటి ప్రాధాన్యత ఓటువేసి గెలిపించాలని ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు అన్నారు. శనివారం వంగిడి, నందమూరు గ్రామాలు, పట్టణంలోని సద్గురు పాఠశాల, శ్రీచైతన్య పాఠశాలలు, ఆర్టీసీ డిపోలలో ఎమ్మెల్సీ కూటమి అభ్యర్థి పేరాబత్తుల రాజశేఖరానికి మద్దతుగా అధ్యాపకులు, ఉద్యోగు లను కలిసి ఓట్లను అభ్యర్థించారు. కార్యక్రమంలో నియోజకవర్గ పరిశీలకులు గొర్రెల శ్రీధర్, మాజీ మున్సిపల్ చైర్మన్ సూరపనేని చిన్ని, పొట్రు సీద్దూ, కూటమి నేతలు, తదితరులు పాల్గొన్నారు. అలాగే మాజీ ఎమ్మెల్యే టీవీ రామారావు అధ్వర్యంలో దొమ్మేరులో జనసేన, బీజేపీ నాయకులతో కలిసి ప్రభుత్వ కార్యాలయాలు, విద్యాసంస్థలలో ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. జనసేన నాయకులు ఎం. వెంకటేశ్వరరావు, కళ్లేపల్లి ప్రభాత్, తోర్లపాటి చంద్రశేఖర్, బీజేపీ నాయకులు నలాది సందీప్‌కుమార్, సాయిరాజ్, తదితరులు పాల్గొన్నారు.

దేవరపల్లి: ఎన్‌డీఏ కూటమి ఎమ్మెల్సీ అభ్యర్థి పేరాబత్తుల రాజశేఖరంను భారీ మెజారిటీతో గెలిపించాలని ఎమ్మెల్యే మద్దిపాటి వెంకట్రాజు అన్నారు. శనివారం స్థానిక చైతన్యస్కూల్, యర్నగూడెం సెంట్‌జోసఫ్ స్కూల్లో ఉపాధ్యాయులతో కలిసి ప్రచారాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రాజశేఖరాన్ని మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని ఉపాధ్యాయులను కోరారు. కార్యక్రమంలో మండల టీడీపీ అధ్యక్షుడు అంబ్రూ అనీల్, టీడీపీ నాయకులు గడా మురళీ అజిత్‌కుమార్, గన్నమని హరికృష్ణ, దుర్గారావు, ఉప్పులూరి రాంబాబు, అల్లిన సురేంద్ర, బళ్ల సూర్యచంద్రం, చిలకా రాజేష్, బొల్లిన విజయభాస్కర్, కూటమి నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

కూటమి బలపర్చిన అభ్యర్థికి పట్టం కట్టండి : మంత్రి దుర్గేష్


కే.సావరం ఎన్నికల ప్రచారంలో మాట్లాడుతున్న మంత్రి దుర్గేష్

ఉండ్రాజవరం/పెరవలి, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి) : ఎమ్మెల్సీ కూటమి అభ్యర్థి పేరాబత్తుల రాజశేఖరాన్ని అత్యధిక మెజార్టీతో గెలిపించాలని పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్ కోరారు. శనివారం కే. సావరంలో జరిగిన సమావేశంలో పాల్గొన్న మంత్రి మాట్లాడుతూ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో రాజశేఖరానికి మొదటి ప్రాధాన్యత ఓటు వేయాలన్నారు. జిల్లా పట్టభద్రుల ఎమ్మెల్సీ ఇన్‌చార్జి బూర్లగడ్డ వేదవ్యాస్ మాట్లాడుతూ ప్రభుత్వం సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు నిర్వహిస్తోందన్నారు. కార్యక్రమంలో కూటమి నాయకులు, తదితరులు పాల్గొన్నారు. అలాగే ఎమ్మెల్సీ ఎన్నికల్లో కూటమి అభ్యర్థి పేరాబత్తుల రాజశేఖరానికి విజయం చేకూర్చాలని మాజీ ఎమ్మెల్యే, నియోజకవర్గ ఇన్‌చార్జి బూరుగుపల్లి శేషారావు పేర్కొన్నారు. శనివారం ముక్కామలలో ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో కూటమి నేతలు పాల్గొన్నారు.

పీడీఎఫ్ అభ్యర్థిని గెలిపించండి


నల్లజర్లలో ఎన్నికల ప్రచారాన్ని నిర్వహిస్తున్న సీఐటీయూ నాయకులు

నల్లజర్ల, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): పీడీఎఫ్ బలపరచిన ఎమ్మెల్సీ అభ్యర్థి డీవీ రాఘవులను అఖండ మెజార్టీతో గెలిపించాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి కొక్కిరపాటి వెంకట్రావు కోరారు. శనివారం నల్లజర్లలో ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. ఈ సందరంగా ఆయన మాట్లాడుతూ రాఘవులు గెలిస్తే ప్రభుత్వాన్ని ప్రశ్నించే గొంతుక అవుతారన్నారు. పీ. కృష్ణారావు, రాజేష్, వీరభద్రం, వెంకట రమణ పాల్గొన్నారు.

రజకుల సమస్యలు పరిష్కరించాలి

• ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా రజకసంఘం అధ్యక్షుడు కట్లయ్య


తిరుగుడుమెట్టలో చెరువు వద్ద ధర్నా చేస్తున్న రజకులు

తాళ్లపూడి, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి) : ఉమ్మడి జిల్లాలో రజకుల చెరువులు అనేక చోట్ల అన్యాక్రాంతమవుతున్నాయని, మరికొన్ని చోట్ల రాజకీయ కారణాలలో రజకులను ఇబ్బందులకు గురిచేస్తున్నారని, వారి సమస్యలు తీర్చాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా రజకసంఘం అధ్యక్షుడు చిలకలపల్లి కట్లయ్య అన్నారు. తిరుగుడుమెట్టలో చెరువు విషయమై శనివారం రజకులంతా కలిసి ఆ చెరువు వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా రజకులు మాట్లాడుతూ గ్రామంలో మొత్తం 50 కుటుంబాల వరకూ ఉన్నాయని, దాదాపు 60 సంవత్సరాల నుంచి ఈ చెరువునే నమ్ముకుని కులవృత్తి చేసుకుని జీవిస్తున్నామని, ప్రస్తుతం కలుషిత డ్రైనేజీ నీరు ఇందులోకి పంపించడానికి అధికారులు చూస్తున్నారని వారంతా ఆరోపించారు. దీనివల్ల మా కులవృత్తిని ఎలా చేసుకోవాలని ప్రశ్నించారు. అనంతరం ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ, పంచాయతీ విస్తరణాధికారికి, గ్రామకార్యదర్శికి వినతి పత్రాలు సమర్పించారు. అనంతరం పలు విషయాలపై మాట్లాడారు. కార్యక్రమంలో రజక నాయకులు చిలకలపల్లి కట్లయ్య, పెదవేగి నాగేశ్వరరావు, పోసియ్య, పూల శిలింగం, అంగారపు వీరాస్వామి, నాగేశ్వరరావు, సరస్వతి, వెంకటలక్ష్మి, రామలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ ప్రయాగ్‌ం అదుర్స్

• వేలాదిగా కుంభమేళాకు తరలిన భక్తులు


నిడదవోలు డిపో నుంచి కుంభమేళాకు వెళుతున్న బస్సు (ఫైల్)

రాజమహేంద్రవరం అర్బన్ /కొవ్వూరు/ నిడదవోలు, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి) : కుంభమేళాకు ఎన్నడూ లేనంతగా వేలాది సంఖ్యలో ఈసారి ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా నుంచి భక్తులు తరలివెళ్లారు. ఇది 144 సంవత్సరాలకు ఒకసారి వచ్చేదని ప్రచారం జరగడంతో దీనిపై మరింత ఆసక్తి పెరిగింది. దీనికనుగుణంగా తప్పనిసరిగా కుంభమేళాకు వెళ్లి పుణ్యస్నానాలు ఆచరించాలని జనం భావించారు. ఎంతో దూరం, మరెంతో వ్యయప్రయాస లైనప్పటికీ భక్తులు వెళ్లారు. రైళ్లలోను, బస్సుల్లోనూ ఈ ప్రయాణాలు చేసేందుకు అందరూ ఏర్పాట్లు చేసుకున్నారు. ప్రత్యేక రైళ్లు వేయడంతో కొంతవరకు ఈ మార్గాన వెళ్లారు. అయితే చాలామంది బస్సుల్లో తీర్థయాత్రల మాదిరిగా వెళ్లడానికి ఆసక్తి చూపారు. దీనికి ప్రధాన కారణం ఏపీఎస్ ఆర్టీసీయే. సాధారణంగా పండుగల్లో స్పెషల్ సర్వీసులు నడపడం ఆర్టీసీకి కొత్తేమీ కాదు. పంచారామ క్షేత్రాల దర్శనాలకూ సర్వీసులు నడుపుతారు. కానీ కొద్దికాలంగా ఆర్టీసీ అధికారులు వచ్చిన ప్రతి అవకాశాన్ని వినియోగించుకునేందుకు డిపోలవారీగా పోటీపడుతున్నారు. అరుణాచలం గిరి ప్రదక్షిణలకు ప్రతినెలా సర్వీసులు నడుపుతున్నారు. ఏకాదశ రుద్రుల దర్శనం పేరిట కొవ్వూరు డిపో నుంచి వంద బస్సులకు పైగా ప్రత్యేక సర్వీసులు నడిపారు. ఇలా ప్రతి సందర్భాన్ని ఆర్టీసీ యాత్రల పేరిట సర్వీసులు నడపడం విశేషం. ఇందులో భాగంగానే కుంభాభిషేకానికి ప్రత్యేక సర్వీసులను పెద్దఎత్తున నడిపారు. వేలాది కిలోమీటర్ల మేర సర్వీసులు నడపడం అంటే ఆషామాషీ కాదు. యాత్ర బస్సు అంటేనే భోజన, వసతి సౌకర్యాలు సైతం సమకూర్చాలి. ఎలాంటి ఇబ్బందులు ప్రయాణికులకు కలుగకుండా నడపాలి. ఈసారి కుంభమేళాలో ఆర్టీసీ సర్వీసులకు ఎంతో ఆదరణ దక్కింది. భోజన, వసతి సదుపాయాల్లో చక్కటి సౌకర్యాలు సంతృప్తి కలిగించాయి. టిక్కెట్టు ధర కూడా రూ.10,800 నుంచి రూ. 12500 మధ్య అందుబాటులోనే ఉండడం మరింత వెసులుబాటు కలిగించింది. ఇన్ని సౌకర్యాలు కల్పిస్తూనే ఆర్టీసీ కూడా తమ ఆదాయాన్ని గణనీయంగా పొందడం మరో విశేషం.

• తూర్పుగోదావరి జిల్లాలో రూ.47.52 లక్షల ఆదాయం

ప్రయాగ్‌రాజ్ మహాకుంభమేళాకు కాకినాడ జిల్లా ఆర్టీసీ 532 మంది భక్తులను ఇప్పటి దాకా పుణ్యస్నానాలకు తీసుకెళ్లింది. ఈ కుంభమేళా టూర్ ద్వారా జిల్లా ఆర్టీసీకి రూ.47,52, 400 ఆదాయం లభించింది. రాజమహేంద్రవరం, గోకవరం, కొవ్వూరు, నిడదవోలు డిపోల నుంచి మొత్తం 16 బస్సులను ఆపరేట్ చేశారు. గోకవరం డిపో నుంచి రెండు బస్సుల్లో 68 భక్తులు, కొవ్వూరు డిపో నుంచి ఐదు బస్సుల్లో 154 మంది భక్తులు, నిడదవోలు డిపో నుంచి రెండు బస్సుల్లో 72 మంది, రాజమహేంద్రవరం డిపో నుంచి ఏడు బస్సుల్లో 238 మంది భక్తులు కుంభమేళాకు వెళ్లి వచ్చారు. మొత్తం 66, 000 కిలోమీటర్లు మేర ఆర్టీసీ బస్సులను నడపడం ద్వారా జిల్లా ఆర్టీసీ రికార్డు సృష్టించింది.

• బస్సులోనే వంటమనుషులు, రాత్రంతా ప్రయాణం

బస్సుల్లోనే వంట మనుషులు, వంట సామగ్రి.. దర్శనీయ క్షేత్రం తెరిచే సమయానికి బస్సు చేరుకునేలా ప్రణాళిక.. దర్శనం చేసుకుని వచ్చే సరికి అల్పాహారం రెడీ.. మళ్లీ ప్రయాణం.. మధ్యలో భోజనం.. ఇలా పక్కా ప్లాన్‌తో కుంభమేళా టూర్‌ను ఆర్టీసీ అధికారులు సక్సెస్ చేశారు.

• ముందుగా కొవ్వూరు డిపో నుంచి ...

కుంభమేళాకు ముందుకు కొవ్వూరు డిపో నుంచి బస్సులు నడిపారు. ఆ తర్వాత రాజమహేంద్రవరం డిపోతోపాటు గోకవరం, నిడదవోలు, రావులపాలెం, కాకినాడ, మచిలీపట్నం, అనంతపురం, కర్నూలు నుంచి బస్సులు పెట్టారు. ఇలా కుంభమేళా టూర్‌కు మంచి రెస్పాన్స్ రావడంతో అన్ని డిపోల నుంచి బస్సులు వెళ్లాయి.

• 7 రోజుల టూర్‌లో నచ్చినట్టుగా మెనూ

కుంభమేళా యాత్రలో భోజనాలు, దర్శనం, ఇతర సౌకర్యాలకు ఇబ్బంది లేకుండా రెండు, మూడు బస్సులు ఒకేసారి బయలుదేరేలా ప్లాన్ చేసుకున్నారు. వంట కోసం వంటమాస్టర్‌తో పాటు, ఒక మగ, ఇద్దరు మహిళలు (సహాయకులు)ను తీసుకెళ్లారు. వంట సామగ్రి అంతా వాళ్లే తెచ్చుకుంటారు. బస్సు ఆగిన టైంలో వంట చేసి పెడతారు. పూర్తి శాఖాహార బ్రాహ్మణ భోజనం అందించారు. ఉదయం టిఫిన్, మధ్యాహ్నం భోజనం, రాత్రి టిఫిన్ అందించారు. దీనికి ఒకరికి రోజుకు రూ.250 చొప్పున చెల్లించారు. ఉత్తరాదిలో ఫుడ్ వల్ల ఇబ్బంది వస్తుందనే ఈ ఏర్పాట్లు చేశారు.

• పుష్‌బ్యాక్ సీట్లు కావడంతో

బస్సు ప్రయాణంలో యాత్రికులకు ఎలాంటి ఇబ్బంది ఎదురుకాలేదు. బస్సులోనే రెస్ట్ తీసుకునేవారు. ప్రయాగ్‌రాజ్‌కు ఐదు కిలోమీటర్ల దూరంలో బస్సులను ఆపేసేవారు. అక్కడి నుంచి భక్తులు ఆటోలో వెళ్లి దర్శనం చేసుకుని తిరిగి పార్కింగ్ ప్రదేశానికి వచ్చేవారు. ఈ క్రమంలో సంబంధిత ఆర్టీసీ డిపో అధికారులు, టూర్‌కో ఆర్డినేటర్లు ఎప్పటికప్పుడు మానిటరింగ్ చేయడంతో ఆర్టీసీ కుంభమేళా యాత్ర సక్సెస్‌ఫుల్‌గా సాగిందని చెప్పాలి.

చిట్యాలలో ముగిసిన టెన్నికాయిట్ పోటీలు


విజేతలకు బహుమతులు అందిస్తున్న గ్రామపెద్దలు, ఉపాధ్యాయులు

గోపాలపురం, ఫిబ్రవరి 22(ఆంధ్రజ్యోతి): విద్యకు క్రీడా ప్రతిభ తోడైతే యువత అద్భుతాలను సొంతం చేసుకోగలుగుతుందని ఎంఈవో శ్రీనివాసరావు అన్నారు. చిట్యాల జడ్పీ హైస్కూల్లో శుక్రవారం ప్రారంభమైన రాష్ట్రస్థాయి 82వ టెన్నికాయిట్ పోటీలు శనివారం సాయంత్రంతో ముగిశాయి. ఈ సందర్భంగా పాఠశాల హెచ్‌ఎం శ్రీపాద లక్ష్మీనరసింహశాస్త్రి అధ్యక్షతన ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన పోటీల్లో గెలుపొందిన విజేతలకు బహుమతులను అందజేశారు. అలాగే 13 జిల్లాల క్రీడాకారులు ఒడిశాలోని జవహర్‌లాల్ నెహ్రూ స్టేడియంలో ఈ నెల 25 నుంచి 29 వరకు జరిగే 48వ జాతీయ పోటీలకు హాజరవుతారన్నారు. ఈ క్రీడల్లో గెలుపొందిన బాలురు, బాలికల సర్టిఫికెట్లు, మెమెంటోలతో ఘనంగా సత్కరించారు. బాలికల విభాగం నుంచి మౌనిక (విజయనగరం), రేణుక (విజయనగరం), శ్రావణి (విజయనగరం), ఎస్.ఈశ్వరి కర్నూలు, కే.జ్యోతిక అనంతపూర్, ఏ.మౌనిక పశ్చిమగోదావరి, బాలుర విభాగం నుంచి పీజే ఎండీ రామారావు, కాకినాడ, వినయ్ కుమార్ కాకినాడ, సీహెచ్ తారకేశ్వరరావు శ్రీకాకుళం, త్రిమూర్తులు కాకినాడ, పవన్‌కుమార్ పశ్చిమ గోదావరి, చంటిబాబు పశ్చిమ గోదావరి, తదితర క్రీడాకారులు గెలుపొందారు. సమగ్ర శిక్ష ఏపీసీ సుభాషిణి, ఏఎంవో గౌరీ శంకరరావు, ఉపవిద్యాశాఖాధికారి రామన్నదొర పర్యవేక్షించారు. కార్యక్రమంలో గద్దే చంద్రశేఖర్, పేరం రవీంద్ర, కేఎల్‌పీ సత్యనారాయణ, వ్యాయామ ఉపాధ్యాయులు నాగరాజు, ఏ. వెంకటేశ్వరరావు, రామకృష్ణరాజు, లక్ష్మణరావు, రమేష్, కొయ్య నాగరాజు, దాతలు శేషగిరిరావు, గద్దే హరిబాబు, సుబ్రహ్మణ్యం, కొండేపాటి రత్నాజీచౌదరి, విద్యార్థులు, ఉపాధ్యాయులు,తదితరులు పాల్గొన్నారు.

భార్యను కత్తితో నరికి చంపిన భర్త అరెస్టు

కొవ్వూరు, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి) : కత్తితో భార్యను నరికి చంపిన వ్యక్తిని అరెస్టు చేసినట్టు కొవ్వూరు పట్టణ సీఐ పీ. విశ్వం తెలిపారు. కొవ్వూరు మండలం వాడపల్లి బంగారమ్మపేటలో భార్య, మామపై కొబ్బరి బొండాలు కొట్టే కత్తితో దాడి చేసిన కేసులో ముద్దాయి గండ్ర మురళీకృష్ణ చౌదరిని శనివారం కొవ్వూరు పాత రైలు వంతెన (హేవలాక్‌బ్రిడ్జి) వద్ద అరెస్టు చేశామన్నారు. ఈ నెల 20వ తేదీన కుటుంబ వివాదాల నేపథ్యంలో బంగారమ్మపేటకు చెందిన గండ్ర కృష్ణతులసి (37)ను భర్త గండ్ర మురళీకృష్ణ చౌదరి కత్తితో నరికేయడంతో అక్కడికక్కడే మృతి చెందిన సంగతి తెలిసిందే. ఆ తర్వాత అడ్డువచ్చిన అతని మామ అడ్డాల నాగేశ్వరరావును కత్తితో గాయపర్చాడు. దీనిపై మృతురాలి సోదరుడు అందించిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు. దర్యాప్తులో భాగంగా మురళీకృష్ణచౌదరిని కొవ్వూరు పట్టణంలోని పాత రైలు వంతెన వద్ద అరెస్టుచేశారు. రిమాండ్ నిమిత్తం కోర్టులో హాజరుపర్చారు.

చిన్నారులకు శిక్షణ అవసరం


శిక్షణలో మాట్లాడుతున్న ఎంఈవో

చాగల్లు, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): చిన్నారుల్లో నైపుణ్యం పెంపొందించేందుకు సరైన శిక్షణ అవసరమని ఎంఈవో యు. గురునాథం అన్నారు. శనివారం స్థానిక జడ్పీ హైస్కూల్లో మండల పరిధిలోని అంగన్‌వాడీ సిబ్బందికి జ్ఞానజ్యోతి శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మెరుగైన అభ్యసన పద్ధతులతో చిన్నారులకు మానసిక వికాసం కలిగే విధంగా విద్యాబోధన చేయాలన్నారు. ఎంఈవో-2 సుభాకర్, అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు పద్మావతి, జీ. శిరీష, రిసోర్సు పర్సన్ పిల్లి శ్రీనివాసమూర్తి పాల్గొన్నారు.

సారా తయారీ కేంద్రంపై దాడి

తాళ్లపూడి, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): తుపాకులగూడెంకి చెందిన రాయుడు దానయ్య సారా తయారు చేస్తున్నట్టు వచ్చిన సమాచారం మేరకు శనివారం తన సిబ్బందితో వెళ్లి దాడి చేసినట్టు కొవ్వూరు ఎక్సైజ్ సీఐ సత్యనారాయణ తెలిపారు. ఖాళీగా ఉన్న ఎసైన్డ్ భూములలో రహస్యంగా పాత నేరస్తుడైన దానయ్య రవాణాకు సిద్ధంగా ఉంచిన 35 లీటర్ల సారా, 16 డ్రమ్ముల్లో ఉన్న 3,200 లీటర్ల బెల్లపు ఊటను ధ్వంసం చేశామన్నారు. అలాగే కవర్లలో ఐదు కేజీల వరకు అమ్మోనియా ఉన్నట్టు గుర్తించామని చెప్పారు. దీనిపై కేసు నమోదు చేసి దానయ్యను అరెస్టు చేశామన్నారు. ఎస్‌ఐ రవికుమార్, సిబ్బంది నారాయణ, సత్యనారాయణ, నాగేశ్వరరావు, వీఆర్‌వో సాయి పాల్గొన్నారు.

గ్రామాల్లో ప్రత్యేక పారిశుధ్య పనులు


చాగల్లులో తడి, పొడిచెత్త సేకరణపై అవగాహన కల్పిస్తున్న పంచాయతీ సిబ్బంది


గోపాలపురంలో తడి, పొడిచెత్తను సేకరిస్తున్న ఇన్‌చార్జి ఎంపీడీవో శ్రీనివాస్, తదితరులు

చాగల్లు, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): ప్రజారోగ్యం, పరిసరాల శుభ్రతే లక్ష్యంగా పారిశుధ్య నిర్వహణపై ప్రత్యేక శ్రద్ధతో పనిచేస్తున్నట్టు పంచాయతీ కార్యదర్శి మహ్మద్ ఆలీ చెప్పారు. పారిశుధ్య నిర్వహణ ప్రత్యేక డ్రైవ్‌లో భాగంగా శనివారం పంచాయతీ సిబ్బంది పర్యటించి ప్రజలకు అవగాహన కల్పించారు.

తాళ్లపూడిలో స్పెషల్ డ్రైవ్


శానిటేషన్ స్పెషల్ డ్రైవ్‌లో కార్యదర్శి శ్రీనివాస్, పంచాయతీ సిబ్బంది

తాళ్లపూడి, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పలుగ్రామాలలో జిల్లా పంచాయతీ అధికారి ఆదేశాల మేరకు శనివారం శానిటేషన్‌పై స్పెషల్‌డ్రైవ్ నిర్వహించారు. తాళ్లపూడిలో చెత్తను తరలించే వాహనాల ద్వారా తడి, పొడి చెత్తపై అవగాహన కలిపించినట్టు కార్యదర్శి, ఈవోపీఆర్‌డీ వీరన్న తెలిపారు. అలాగే మలకపల్లిలో కార్యదర్శి కామేశ్వరి పర్యవేక్షణలో చెత్తసేకరణ జరిగింది. అన్నదేవరపేటలో కార్యదర్శి శ్రీనివాస్ అధ్వర్యంలో పంచాయతీ సిబ్బందికి, డ్వాక్రా మహిళలకు తడి, పొడి చెత్తపైన అవగాహన కలిపించారు. కార్యక్రమంలో సచివాలయ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

పారి శుధ్యం నిరంతర ప్రక్రియ

గోపాలపురం: ప్రజారోగ్య పరిరక్షణలో పారిశుధ్యం నిరంతర ప్రక్రియ అని ఇన్‌చార్జి ఎంపీడీవో కే.ఎస్‌ఎస్ శ్రీనివాస్ అన్నారు. పంచాయతీరాజ్ కమిషనర్ ఎంవీఆర్ కృష్ణతేజ ఆదేశాల మేరకు రెండు రోజుల పాటు చెత్త నుంచి సంపద తయారీలో భాగంగా తడి, పొడి చెత్త సేకరణ కార్యక్రమాన్ని శనివారం చేపట్టారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి స్వర్ణలత, ఆయా పంచాయతీల కార్యదర్శులు, పంచాయతీ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

ఉండ్రాజవరం/పెరవలి: ఉండ్రాజవరం, పెరవలి మండలాల్లో శనివారం ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ప్రత్యేక పారిశుధ్య పనులు చేపట్టారు. గ్రామపారిశుధ్య సిబ్బంది ఇంటింటికీ వెళ్లి చెత్తను సేకరించారు. పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది తడి, పొడిచెత్త గురించి ఇంటింటికీ వెళ్లి వివరించారు. ఎంపీడీవో పీఎస్ రామారావు, ఈవోపీఆర్డీ కేఎస్‌ఆర్ శర్మ కార్యక్రమాన్ని పర్యవేక్షించారు.


పాలంగిలో చెత్త కుప్పలు తొలగిస్తున్న దృశ్యం

స్కౌట్స్ పితామహుడు బాడెన్ పావెల్ జన్మదిన వేడుకలు


వంగిడి పాఠశాలలో వేడుకలను నిర్వహిస్తున్న విద్యార్థులు

కొవ్వూరు, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): వంగిడి జడ్పీ హై స్కూల్లో స్కౌట్స్ పితామహుడు బాడెన్ పావెల్ జన్మదిన వేడుకలను శనివారం ఘనంగా నిర్వహించారు. పాఠశాల హెచ్‌ఎం మంగిన శ్రీరామారావు ఆధ్వర్యంలో స్కౌట్, గైడ్ ఉపాధ్యాయులు పితాని నాగేంద్ర రవికుమార్, షేక్ రషీదా పాల్గొని పతాక ఆవిష్కరణ చేశారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు,తదితరులు పాల్గొన్నారు.

'కృషి, పట్టుదలతో విద్యనభ్యసిస్తే ఉన్నతశిఖరాలు'

దేవరపల్లి, ఫిబ్రవరి22 (ఆంధ్రజ్యోతి): కృషి, పట్టుదల, క్రమశిక్షణతో విద్యనభ్యసిస్తే జీవితంలో ఉన్నత శిఖరాలను అధిరోహి స్తారని రాష్ట్ర మానవత సంస్థ కన్వీనర్ బలుసు సత్యనారాయణ అన్నారు. దేవరపల్లిలో ఆనంద్ ఎడ్యుకేషనల్ జూనియర్ కళాశాలలో ఇంటర్ విద్యార్థులకు ఫేర్‌వెల్ డే జరిగింది. కళాశాల ప్రిన్సిపల్ విక్రమ్ అధ్యక్షతన కార్యక్రమం జరిగింది. అధ్యాపకులు ఎస్.వెంకట్రావు, యూ. ఉషా రాణి, శ్రీదుర్గ, ఎం.మం గాయమ్మ, శ్రీనివాస్, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.